ప్రజాశక్తి

శుక్రవారం 7 ఫిబ్రవరి 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

నామినేషన్ వేసేందుకు భారీ ర్యాలీగా వెళ్తున్న విజయగౌరి

ఉత్సాహంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి

విజయగౌరి నామినేషన్

- విశాఖలో భారీ ర్యాలీ, బహిరంగ సభ
- ఉత్తరాంధ్ర నలుమూలల నుంచి కదిలొచ్చిన ఉపాధ్యాయులు
- గెలుపుతో ఉత్తరాంధ్రలో చరిత్ర లిఖించాలని వక్తల పిలుపు

ప్రజాశక్తి – గ్రేటర్ విశాఖ బ్యూరో, విశాఖ కలెక్టరేట్

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి యుటిఎఫ్ బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోరెడ్ల విజయగౌరి నామినేషన్ దాఖలు కార్యక్రమం విశాఖలో గురువారం అట్టహాసంగా సాగింది. ముందుగా ఉత్తరాంధ్ర నలుమూలల నుంచి తరలివచ్చిన యుటిఎఫ్ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఆమె విశాఖ నగరంలోని సరస్వతి పార్క్ నుంచి భారీ ర్యాలీగా బయలుదేరారు. లీలామహల్ జంక్షన్, జగదాంబ జంక్షన్ మీదుగా ఈ ర్యాలీ సాగింది. జగదాంబ థియేటర్‌కు ఎదురుగా ఉన్న తెన్నేటి విశ్వనాథం విగ్రహానికి విజయగౌరి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అక్కడ నుంచి మరలా మహారాణిపేట, కెజిహెచ్ మీదుగా కలెక్టరేట్ వరకూ ర్యాలీ కొనసాగింది. అక్కడ ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ పాలకులు విద్యారంగాన్ని నాశనం చేసే సంస్కరణలను అవలంబిస్తున్నారని తెలిపారు. విద్యారంగ పరిరక్షణకు విజయగౌరి గెలుపు అవసరమన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ రానున్న 20 రోజులూ ఎంతో కీలకమన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా విజయగౌరిని గెలిపించుకునే లక్ష్యంతో అందరూ కలిసి పనిచేయాలన్నారు. విజయగౌరి నామినేషన్ ర్యాలీలో అధికంగా మహిళలు పాల్గొన్నారని, పిడిఎఫ్ అభ్యర్థి గెలుపు కోసం ఇంటింటికీ వెళ్తుంటే మహిళలంతా పిడిఎఫ్‌కే తమ సంపూర్ణ మద్దతు ఇస్తామని చెబుతున్నారని, ఇదంతా చాలా ఉత్సాహం కలిగిస్తోందని అన్నారు. గతంలో అప్రెంటీస్ రద్దుపై యుటిఎఫ్ పోరాడినప్పుడు నాటి ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు జాడ లేకుండా పోయాడన్నారు. జగన్ తెచ్చిన 117 జిఒకు వ్యతిరేకంగా విజయవాడలో వేల సంఖ్యలో టీచర్లంతా పోరాడినప్పుడు ఎంఎల్‌సిగా ఉన్న పాకలపాటి రఘువర్మ పత్తాలేకుండా పోయాడని తెలిపారు. అందుకే టీచర్లంతా పిడిఎఫ్ అభ్యర్థులపై మిగతా 2లో..



బహిరంగ సభలో మాట్లాడుతున్న విరపు బాలసుబ్రమణ్యం, చిత్రంలో విజయగౌరి, ఎంవిఎస్.శర్మ, ఎన్.వెంకటేశ్వర్లు

ఆర్ఒకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న విజయగౌరి

ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం

వార్త 2లో..

ఈగల్ వింగ్ జోనల్ సిఐగా రమేష్

వార్త 2లో..

నిరుపయోగంగా వసతి గృహాలు

వార్త 8లో..

నేడు, రేపు తాగునీటికి అంతరాయం

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : కృష్ణాపురం హెడ్ వాటర్ పంపు హౌస్ మరమ్మతుల కారణంగా మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ జోన్-8 పరిధిలోని పలు ప్రాంతాలకు ఈ నెల 7, 8 తేదీల్లో తాగునీటికి అంతరాయం ఏర్పడుతుందని మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీరు బి.మురళీకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కృష్ణాపురం హెడ్ వాటర్ పంప్ హౌస్ మరమ్మతుల నిమిత్తం 7వ తేదీ ఉదయం 10 గంటల నుండి 8వ తేదీ ఉదయం 10 గంటల వరకు మంచినీటి సరఫరాను పూర్తిగా నిలిపివేస్తామని పేర్కొన్నారు. తాటిపూడి ప్రధాన పైపులైన్ పైన ఉన్న మంచినీటి సరఫరా బల్క్ (రెసిడెన్షియల్), ఇండస్ట్రీస్ వినియోగదారులకు, జోన్ – 8 పరిధిలో ఉన్న 93 నుంచి 98 వార్డుల పరిధిలో ఉన్న సాయి దుర్గా నగర్, దుర్గా నగర్, కృష్ణానగర్, అప్పుల నరసింహం కాలనీ, వెంకట సాయి నగర్, బంటా కాలనీ, రవి నగర్, లక్ష్మీపురం, పోర్టు కాలనీ, రామ కో-ఆపరేటివ్ కాలనీ, హెచ్‌బి.కాలనీ, రెల్లి వీధి, కృష్ణరాయపురం, గొల్లివిల్లివానిపాలెం, ఎల్‌ఐసి కాలనీ, సుజాతనగర్, పాపయ్య రాజుపాలెం, పెందుర్తి పాత గ్రామం, తెలకల వీధి, జెడ్‌పిహెచ్‌ఎస్ ఏరియా, ప్రశాంతి నగర్, క్రాంతి నగర్, వుడా కాలనీ, రైల్వే కాలనీ, ప్రశాంతి నగర్, సావిత్రి నగర్, అప్పన్నపాలెం, సింహపురి లేఅవుట్, అడవివరం, ఎస్సీ కాలనీ, పాత అడవివరం, అడవివరం, తదితర ప్రాంతాలలో తాగునీటికి అంతరాయం కలుగుతుందని తెలిపారు. ఆయా ప్రాంతాలకు ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు చర్యలు తీసుకున్నామన్నారు.

అనకాపల్లి : అనకాపల్లి పట్టణ ప్రాంత పరిధిలో ఉన్న ఆరు రిజర్వాయర్లలో నీరు కలుషితమైనందున ఈ నెల 7, 8 తేదీల్లో మంచినీటి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్టు నీటి సరఫరా సాంకేతిక విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మరమ్మతులకు ఉపయోగించిన కలుషిత నీటిని శారద నదిలోకి విడిచిపెట్టడం వల్ల నీరు కలుషితమైందని తెలిపారు. మంచినీటి ట్యాంకర్లు అవసరమైన వారు 8978486139 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు

విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ భూముల పరిరక్షణకు రెవెన్యూ అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో భీమిలి డివిజన్ రెవెన్యూ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్‌తో కలిసి ఆయన వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతులపై రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించాలని, వీలైనంత వేగంగా సేవలందించాలని సూచించారు. ప్రభుత్వ పాలసీ ప్రకారం నిబంధనలను అనుసరించి ప్రజలకు సులభతర విధానంలో సేవలందించాలని చెప్పారు. క్షేత్ర స్థాయి పరిస్థితులపై పూర్తిగా అవగాహన పెంచుకొని విధులు నిర్వర్తించాలన్నారు. అన్యాక్రాంతానికి గురైన భూములను గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లోపభూయిష్టమైన రికార్డుల నిర్వహణ లేకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. తాజాగా ఎక్కడైనా ఆక్రమణలు చోటు చేసుకున్నట్టు తెలిస్తే స్థానిక రెవెన్యూ అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో భాగంగా రీ-వెరిఫికేషన్ ఆఫ్ ఫ్రీ హోల్డ్ కేసెస్, ఆక్రమణ-ఎంక్రోచ్‌మెంట్ అఫ్ వాటర్ బాడీస్, ఎంక్రోచ్‌మెంట్ మిగతా 2లో..

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మొదటి పేజీ తరువాయి..

ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు

ఆఫ్ ఆన్ అబ్జెక్షనబుల్ ల్యాండ్స్, యుఎస్‌సి, ప్రభుత్వ భూముల పరిరక్షణ, రెవెన్యూ రికార్డుల నిర్వహణ, 22ఎ – డి.నోటిఫికేషన్, ఆర్ఒఆర్ అపీల్స్, కోర్ట్ కేసెస్, పిజిఆర్ఎస్, ఆర్‌టిఐ –2005, పిరియాడికల్ రిపోర్ట్స్ తదితర అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అదే విధంగా గ్రామ సభలలో వచ్చిన పబ్లిక్ గ్రీవెన్స్ పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి చర్యలు తీసుకోవాలన్నారు. నిబద్ధతతో పని చేయాలని, అప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని అన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీ శంకర్, భీమిలి ఆర్‌డిఒ సంగీత్ మాధుర్, ప్రత్యేక ఉప కలెక్టర్లు, సర్వే విభాగం ఎడి, కలెక్టరేట్ ఎఒ, ల్యాండ్ సెక్షన్ అధికారులు, భీమిలి నియోజకవర్గ పరిధిలోని తహశీల్దార్లు, డిటిలు, ఆర్ఐలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం

ప్రజాశక్తి – మధురవాడ : అర్హులకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వ హామీని అమలు చేసేలా ఒత్తిడి తెస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. గురువారం ఆ పార్టీ ఆధ్వర్యాన జివిఎంసి జోన్ – 2 పరిధి మధురవాడ 7వ వార్డు వాంబే కాలనీలో ఇళ్ల స్థలాల కోసం వ్యక్తిగత దరఖాస్తులు పూరించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలు పేదలకు ఏమూలకూ సరిపోలేదని, కొన్నిచోట్ల నివాసయోగ్యంగా లేవని అన్నారు. అప్పట్లో ఇచ్చిన రూ.లక్షా 80 వేలు ఇంటి నిర్మాణానికి సరిపోలేదన్నారు. ఆ మొత్తాన్ని పెంచాలని ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకోలేదని తెలిపారు. పేదలను పట్టించుకోని జగన్ సర్కారు ఎన్నికల్లో ఓటమిపాలైందన్నారు. ఈ విషయాన్ని గుర్తెరిగి కూటమి ప్రభుత్వం మెలగాలన్నారు. ఇంటి నిర్మాణ మొత్తాన్ని రూ.5 లక్షలకు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం వాంబే కాలనీలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, మధురవాడ ఏరియా కార్యదర్శి వి.సత్యనారాయణ, జిల్లా సమితి సభ్యులు ఎంఎ.భేగం, జెడి.నాయుడు, బి.కేశవయ్య, పాత్రుడు, కె.జగన్నస్వామి పాల్గొన్నారు.

సౌత్ కోస్ట్ రైల్వే జోన్ పరిధిపై టిడిపి హర్షం

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్ : విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ పరిధిని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం హర్షించదగిన విషయమని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎంపీ ఎం.శ్రీ భరత్ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో మీడియాతో వారు మాట్లాడుతూ వాల్తేర్ డివిజన్‌ను విశాఖ డివిజన్‌గా పేరు మార్పు చేశారన్నారు. 410 కిలోమీటర్ల పరిధిలో సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటు కానుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం విజ్ఞప్తిని పరిగణనలో తీసుకున్న కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. తాజా నిర్ణయం విశాఖ రైల్వే అభివృద్ధిలో చారిత్రాత్మకమైన ముందడుగుగా నిలిచిపోతుందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారన్నారు.

ఈగల్ వింగ్ జోనల్ సిఐగా రమేష్

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం సిటీ ఈగల్ వింగ్ జోనల్ సిఐగా ఎస్.రమేష్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో యువత అసాంఘిక శక్తుల ప్రేరేపితం వల్ల మత్తు, చెడు వ్యసనాలకు బానిసలై చక్కని జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. ఇదిలా ఉండగా ఆయన గతంలో విశాఖపట్నం జిల్లా పరిధిలో 2010 నుండి 2022 వరకు లా అండ్ ఆర్డర్, క్రైమ్, ట్రాఫిక్, మెరైన్, సైబర్ క్రైమ్, సిఐడి, సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. 2023లో సిఐగా ప్రమోషన్ తీసుకొని ఏజెన్సీలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో జి.మాడుగుల సర్కిల్‌లో సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించారు. 2024లో పార్వతీపురం మన్యం డిసిఆర్‌బి సిఐగా పనిచేశారు.

ఎపిజెయు రాష్ట్ర గౌరవాధ్యక్షునిగా కంచర్ల

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఎపిజెయు) రాష్ట్ర గౌరవాధ్యక్షునిగా ఉపకార్ ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ కంచర్ల అచ్యుతరావు నియమితులయ్యారు. ఈ విషయాన్ని సంఘం అధ్యక్షులు వాసుదేవనాయుడు, ప్రధాన కార్యదర్శి చాలాది పూర్ణ చంద్రరావు, సీనియర్ ఉపాధ్యక్షులు ఎన్ఎస్.వెంకటరమణ, కోశాధికారి ప్రసాద్ గురువారం తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంఘాలకు చైర్మన్‌గా ఉన్న కంచర్ల అచ్యుతరావు తమ సంఘానికి గౌరవాధ్యక్షులుగా నియమితులవడం ఆనందంగా ఉందన్నారు.

ఉత్సాహంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి

విజయగౌరి నామినేషన్

నృత్యాలతో సందడి చేస్తున్న మహిళా ఉపాధ్యాయులు

యుటిఎఫ్ జెండాలతో కదంతొక్కిన ఉపాధ్యాయులు

(మొదటి పేజీ తరువాయి..)

నమ్మకంతో ఉన్నారని ఉద్ఘాటించారు. విద్యారంగ పరిరక్షణ కోసం ఉత్తరాంధ్రలో పోరాడిన చరిత్ర కోరెడ్ల విజయగౌరిదని, ఆమె కుటుంబానికి ఉద్యమ నేపథ్యం ఉందని గుర్తుచేశారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విజయగౌరి పోరాట ప్రస్థానాన్ని తెలిపారు. ఆమె విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ బొబ్బిలి బిడ్డ, సమస్యలపై ప్రశ్నించే గొంతు అయిన విజయగౌరికి విజయం చేకూరేలా అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యమాలు చేపట్టకపోతే ప్రభుత్వ విధానాల్లో మార్పు రాదని, ఉపాధ్యాయులకు కష్టాలొచ్చినప్పుడు కనపడని వారు నేడు పోటీకి సై అంటున్నారని తెలిపారు. అటువంటివారిని విద్యావంతులైన టీచర్లు ఓడించాలన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ మాట్లాడుతూ విద్యారంగాన్ని ధ్వంసం చేసే జాతీయ విద్యావిధానాన్ని ఆంధ్రప్రదేశ్ మాత్రమే అమలు చేస్తోందని, పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపిస్తేనే దీన్ని అడ్డుకోవడం సాధ్యపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి యుఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంపోలు వెంకటేశ్వర్లు, యుటిఎఫ్ నాయకులు ఎస్ఎస్.నాగమణి, టిఆర్.అంబేద్కర్, దాసరి నాగేశ్వరరావు, వి.శ్రీలక్ష్మి చినబ్బాయ్, వి.మహేశ్వరరావు, రెడ్డి మోహనరావు, జి.ఈశ్వరరావు, రమేష్ పట్నాయక్, డి.రాము, ఎస్.మురళీ మోహనరావు, భాస్కరరావు, బాబూరావు, కిషోర్ కుమార్, చౌదరి రవీంద్ర, గంటి గిరిధర్‌రావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, డాక్టర్ బి.గంగారావు, పద్మ, కుమార్, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

జగదాంబ జంక్షన్‌లోని తెన్నేటి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న విజయగౌరి

సభలో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

ఉపాధ్యాయుల సంక్షేమం అజెండాగా పనిచేస్తా : విజయగౌరి

పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. విద్యా రంగంలో జిఒ 117ను సంపూర్ణంగా రద్దు చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తానన్నారు. పాఠశాలల మూత ఆపాలని, సిపిఎస్ రద్దు చేయాలని గొంతెత్తుతానన్నారు. యాప్‌ల భారం ఉపాధ్యాయులకు ఉండకుండా చేస్తానన్నారు. విద్యారంగాన్ని రక్షించే పోరాటాలు సాగిస్తానన్నారు. ఈ ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలిచేలా అందరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆమె విశాఖ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరేంధిర ప్రసాద్‌కు నామపత్రాలు దాఖలు చేశారు.

గౌరవ ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు ఖమ్మం

E.P. No. 103/2024 In OS. No. 360/2013

బిట్వీన్

మాదినేని వీరభద్రరావు ..... D.Hr. /Plaintiff

మరియు

చావా నాగ శ్రీనివాసరావు .... JDR/Defendant

చావా నాగ శ్రీనివాసరావు, తండ్రి: వెంకట్రావు, వయస్సు: 60 సం।। వృతి: ప్రభుత్వ ఉద్యోగి, నివాసం: ఇంటి నెంబర్ 7-3-7/1, ద్వారకా నగర్, ఖానాపురం హవేలి ఖమ్మం పట్టణము మరియు జిల్లా

పైన పేర్కొన్న పిటిషన్‌లో మీరు ప్రతివాదిగా ఉండి ఉన్నారు, ఇట్టి కేసులో గౌరవ కోర్టు వారు మీకు పలుమార్లు నోటీసులు పంపినప్పటికిని మీరు ఉద్దేశ్య పూర్వకంగా తిరస్కరించినందున కోర్టు వారి అనుమతితో ఈ ప్రకటన ఇవ్వనైనది, ఇట్టి కేసు మీ హాజరు నిమిత్తం ది.24.02.2025 వ తేదీన పై కోర్టు వారి వద్ద కలదు. కావున మీరు ది. 24.02.2025 న ఉదయం 10:30 లకు పై కోర్టు వారి ముందు స్వయంగా గానీ, మీ న్యాయవాది గారి ద్వారా కానీ హాజరై మీ అభ్యంతరములు తెలియజేయగలరు లేనియెడల కేసు మీ పరోక్షములో నిర్ణయించబడును.

//కోర్టు వారి అనుమతితో //

ఇట్లు,
ఏడునూతల శ్రీనివాసరావు,
శ్రీమతి ఏడునూతల అనురాధ,
న్యాయవాదులు, ఖమ్మం
సెల్ :9849039167

IN THE HON'BLE COURT OF THE V ADDL. DISTRICT JUDGE CUM MAHILA JUDGE AT VIZIANAGARAM
O.S.No. 46 / 2023

Between:
Podilapu Hanumantha Rao ...Plaintiff
And:
Podilapu Ramulamma & 33 Others ... Defendants

NOTICE

To,
D-13: **Mogida Ademma,**
W/o. Late Appala Narasayya,
Opp. Mudasarlova Park Main Gate,
Chinagadili, Visakhapatnam.
D-33: **Yirrirothu Dhanunjaya Rao**
S/o. Y.Guruvulu, D.No. 31-12-16/A,
Allipuram, Bangaramma Metta
Kantakamvari Veedhi, Visakhapatnam.
D-34: **Yirrirothu Radha,**
W/o. Y.Danunjaya Rao, - Rest do-

పై నెంబరు గల దావాలో అనగా O.S.No. 46/2023 పైన పేర్కొన్న కోర్టులో దాఖలు చేసినందున దీని విషయమై, మీకు యెట్టి ఆక్షేపణలున్న యెడల **2025 సం।। ఫిభ్రవరి నెల, 25వ తేదీన ఉదయం 10.30 గంటలకు** మీరు గాని, లేదా మీ వకీలు ద్వారా గాని పై గౌరవ వారి కోర్టులో హాజరై కోర్టు వాతితో మనవి చేసుకోవలసినది, లేనియెడల సదరు విషయమై మీ పరోక్షంగా విచారించి శ్రీకోర్టు వారు తీర్మాణం చేయుదురని ఇందు మూలంగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఆదేశాలతో)

S.B.NAGAMANI
Advocate, Vizianagaram

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VISKAHAPATNAM
I.A. 88/2025 O.S.309/2024

Between:
Pasila Durga Prasad Rao
...Petitioner / Plaintiff
And:
Nelli Suri Babu
...Respondent / Defendant

NOTICE

To
Sri Nelli Suri Babu,
S/o. N. Nagaraju,
D.No. 40-56-46/35, Tatichetlapalem,
Visakhapatnam, Now Residing at
D.No. 40-51-20/19, Santosh Nagar,
Visakhapatnam - 530024.

Whereas the Petitioner/ Plaintiff instituted the above suit against you and the same stands posted to **28-02-2025** for your appearance and on that day at **10-30 am** you should appear before the aforesaid Honourable court either in person or through an Advocate without fail, else the matter will be determined in your absence.

BY ORDERS OF THE HONOURABLE COURT
B. UMA MAHESWARA RAO
Advocate,
Flat No. 202, D.No. 53-41-46/1,
Sai Sravanthi Towers,
K.R.M Colony,
Visakhapatnam 530013,
Mobile: 9848654522.

IN THE HONOURABLE COURT OF THE III ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT VISKAHAPATNAM
I.A. 68/2025 O.S.1173/2024

Between:
Pasila Lalitha ...Petitioner/Plaintiff
And:
Nelli Suri Babu
...Respondent / Defendant

NOTICE

To
Sri Nelli Suri Babu,
S/o. N. Nagaraju,
D.No. 40-56-46/35,
Tatichetlapalem,
Visakhapatnam, Now Residing at
D.No. 40-51-20/19, Santosh Nagar,
Visakhapatnam - 530024.

Whereas the Petitioner/ Plaintiff instituted the above suit against you and the same stands posted to **03-03-2025** for your appearance and on that day at **10-30 am** you should appear before the aforesaid Honourable court either in person or through an Advocate without fail, else the matter will be determined in your absence.

BY ORDERS OF THE HONOURABLE COURT
B. UMA MAHESWARA RAO
Advocate,
Flat No. 202, D.No. 53-41-46/1,
Sai Sravanthi Towers,
K.R.M Colony,
Visakhapatnam 530013,
Mobile: 9848654522.

రోడ్డుపైనే డంపింగ్

ముడసర్లోవ రిజర్వాయర్ పరిసరాల్లో దుర్వాసన

ప్రజాశక్తి - ఆరిలోవ : రోడ్డుపైనే పాత భవన శిథిలాలను యథేచ్ఛగా డంపింగ్ చేస్తున్నారు. రోడ్డు డంపింగ్ యార్డులా మారుతున్నాయి. దీంతో ముడసర్లోవ రిజర్వాయర్‌తో పాటు పరిసర ప్రాంతాలు కంపుకొడుతున్నాయి. జివిఎంసి అధికారులు దీనికి అడ్డుకట్టవేయలేక పోతున్నారు. జివిఎంసి 13వ వార్డు పరిధి ముడరసర్లోవ రిజర్వాయర్ వెనుక భాగంలో ఉన్న రహదారులకు ఇరువైపులా పాత భవన శిథిలాలు, చెత్తను విచ్చలవిడిగా డంపింగ్ చేస్తున్నారు. రహదారికిరువైపులా గుట్టలు గుట్టలుగా పేరుకుపోయింది. గతంలో కూడా చాలా సార్లు ఇక్కడ వేసిన చెత్తను జివిఎంసి అధికారులు తొలగించారు. వీటి తొలగింపునకు జివిఎంసి రూ.లక్షల్లోనే వెచ్చిస్తోంది. వీటికి అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో అటువైపు భారీ వాహనాలు రాకుండా రెండు వైపులా గడ్డల్స్ ఏర్పాటుచేశారు. ఆస్థానంలో పచ్చదనాన్ని పెంపొందించారు. ఇది కొంతవరకే సాగింది. ప్రస్తుతం గడ్డల్స్‌ను తొలగించడంతో మళ్లీ భవన శిథిలాలను యథేచ్ఛగా డంపింగ్ చేస్తున్నారు. రిజర్వాయర్‌కు ఆనుకొని అధికారికంగా ఉన్న డంపింగ్ యార్డుతో పాటు అనధికారికంగా రహదారులపై శిథిలాలతో పర్యావరణం చాలా వరకు దెబ్బతుంటుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి వాటిని తొలగించాలని, రహదారులపై శిథిలాలు వేయకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రిజర్వాయర్ వెనుక రోడ్డులో గుట్టలు గట్టలుగా వేసిన భవన శిథిలాలు

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-యంత్రాంగం

ఆనందపురం: ఆనందపురం సబ్ స్టేషన్ 11కేవీ, ఇండస్ట్రియల్ 11 కేవీ పరిధిలో మరమ్మత్తులు దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎఇ సురేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని భీమన్న దొరపాలెం, రామవరం, జెఎస్.అగ్రహారం, కనమాం, మామిడిలోవ, ఎన్‌జిఆర్.పురం ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, గృహ వినియోగదారులు, రైతులు, పరిశ్రమల యజమానులు గమనించి సహకరించాలని కోరారు.

మధురవాడ : మధురవాడ సెక్షన్ 11కేవీ హిల్ -1 ఫీడర్‌పై మరమ్మత్తుల దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు జోన్ -3 డిఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు అయోధ్య నగర్, ఆర్‌టిసి.కాలనీ, మానం ఆంజనేయల కాలనీ, సాక్షి పేపర్, నగరంపాలెం తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఘనంగా కోరాడ శ్రీను జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం శొంఠ్యాం వైస్ సర్పంచ్ కోరాడ శ్రీను జన్మదిన వేడుకలు గురువారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శ్రీనుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఘట్టమనేని సుభాష్ చంద్ర బోస్, తాట్రాజు అప్పారావు, సోంబాబు, శ్రీకాంత్ రాజ్, బిఆర్‌బి.నాయుడు, సుంకర శివ పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్‌లో 150 మంది విద్యార్థులకు గ్రామంలోని హెల్త్ సెంటర్ సిబ్బంది గురువారం వైద్య పరీక్షలు చేశారు. హెమోగ్లోబిన్ స్థాయి, ఎత్తు, బరువు, దంత, నేత్ర సంబంధిత పరీక్షలు చేశారు. హెచ్ఎం డి.శ్రీనివాసరావు, హిందీ ఉపాధ్యాయులు టిఎస్‌వి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

మేట్‌ల్యాబ్‌పై గీతంలో ఎఫ్‌డిపి

గీతం ఎఫ్‌డిపిలో పాల్గొన్న ప్రతినిధులు

ప్రజాశక్తి -మధురవాడ : శాస్త్ర పరిశోధనలకు, పరిశ్రమలలో సమాచార విశ్లేషణకు, నూతన సాంకేతిక నమూనాలను అభివృద్ధి చేయడంలో ఉపకరించే మేట్‌ల్యాబ్‌ను కృత్రిమ మేధ, మిషన్ లెర్నింగ్‌లలో ఏవిధంగా ఉపయోగించాలో అవగాహన కలిగించేందుకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అధ్యాపకులకు స్వల్పకాలిక శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభించారు. గీతం సిఎస్ఇ విభాగం డీన్ ప్రొఫెసర్ ఎస్.అరుణ్‌కుమార్ మాట్లాడుతూ, మేట్‌ల్యాబ్‌లోని వివిధ సాధనాలను ఉపయోగించి సమాచార విశ్లేషణ లోతుగా ఏవిధంగా పరిశీలించవచ్చో వివరించారు. గీతం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెంటర్ డైరక్టర్ ప్రొఫెసర్ జివిఆర్.శర్మ మాట్లాడుతూ, సాంకేతిక ప్రగతిపై అధ్యాపకులు నూతన ఆవిష్కరణలపై దృష్టి ఉంచాలని, పరిశోధనల ద్వారా ప్రగతిలో పాలు పంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మేథ్ వర్క్స్ సంస్థ శిక్షణాధికారి ఎల్జాజాన్ అధ్యాపకులకు దిశానిర్దేశం చేశారు.

కేర్‌లో మోకాళ్ల మార్పిడికి రోబోటిక్ శస్త్రచికిత్స

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆర్థరైటిస్‌తో బాధపడుతున్న 50 ఏళ్ల రోగికి ఆరిలోవ హెల్త్‌సిటీలోని కేర్ ఆసుపత్రిలో రోబోటిక్ సహాయంతో మోకాళ్ల మార్పిడిని విజయవంతంగా నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. ఆసుపత్రి సమావేశ మందిరంలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఆర్థోపెడిక్ అండ్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ రవిచంద్ర వట్టిపల్లి మాట్లాడుతూ, రోగి గతంలో ఎడమ తొడ ఎముకలో పగులకు గురయ్యారని, ఇది తీవ్రమైన మోకాలి ఆర్థరైటిస్‌కు దారితీసిందని తెలిపారు. సంప్రదాయ శస్త్రచికిత్సలతో కాకుండా ముందుగా ఉన్న ఇంప్లాంట్‌ను తొలగించకుండా ఒకే శస్త్రచికిత్సా విధానంలో వైకల్యం, ఆర్థరైటిస్ రెండింటినీ పరిష్కరించినట్లు వివరించారు. రోబోటిక్ టెక్నాలజీతో ఖచితత్వం, వ్యక్తిగతీకరణ, సరైన అమరిక, మెరుగైన కార్యాచరణ, వేగవంతమైన రికవరీ ఉంటుందని తెలిపారు. అత్యాధునిక సాంకేతికను అవలంభించడంలో కేర్ ఆసుపత్రి ముందుంటుందని పేర్కొన్నారు. ఈ అధునాతన శస్త్రచికిత్స వల్ల రోగి వెంటనే కోలుకొని తన పనులు తాను చేసుకొనే అవకాశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ వై.రఘు, డాక్టర్ ఆర్.అజయ్ పాల్గొన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కేర్ ఆసుపత్రి వైద్యులు

నాంది ఫౌండేషన్ వితరణ

క్రీడా సామగ్రి కిట్లు అందుకున్న బాలికలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని చిప్పాడ జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న 80 మంది బాలికలకు నాంది ఫౌండేషన్ ఆధ్వర్యాన శానిటరీ నాప్కిన్స్‌తో పాటు కోటు, స్పోర్ట్స్ షూ, నోట్ బుక్‌తో కూడిన కిట్లను గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎంవిటి.రత్నం, ఉపాధ్యాయులు రేఖ అప్పారావు, సత్యవతి, త్రివేణి, అనురాధ, నాంది ఫౌండేషన్ ఇన్‌స్ట్రక్టర్ వి.రమాదేవి, పిఇటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం గంభీరం ఆర్‌టిఒ ఆఫీస్ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చింతాత రవి (53) మృతి చెందినట్లు సిఐ చింతా వాసునాయుడు తెలిపారు. సిఐ కథనం ప్రకారం... గొట్టిపల్లి గ్రామానికి చెందిన చింతాడ రవి గంభీరం సమైక్య అపార్ట్‌మెంట్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఇంటి నుంచి విధుల నిమిత్తం రవి ఉదయం 5 గంటలకు బయలుదేరి వెళ్లాడు. గంభీరం ఆర్‌టిఒ ఆఫీస్ ఎదురుగా ఆటో దిగి రోడ్డు దాటుతుండగా వైజాగ్ నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం రవిని ఢీకొట్టి వాహనాన్ని ఆపకుండా పరారయ్యారు. రవి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ ప్రాంతంలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డు కోరాడ శ్రీను గమనించి ఘటన స్థలానికి వచ్చి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని కుమార్తె చింతాడ భవాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిఐ చింతా వాసునాయుడు ఆధ్వర్యాన ఎస్ఐ గంట్యాడ సంతోష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. మృతునికి భార్య పోలమ్మ, కుమార్తె భవాని ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖరరావు

విద్యార్థి దశ కీలకం

ప్రజాశక్తి -భీమునిపట్నం : జీవితంలో విద్యార్థి దశ కీలకమైందని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ జె.చంద్రశేఖరరావు అన్నారు. స్థానిక గొల్లలపాలెం కెజిబివిలో టెన్త్ విద్యార్థుల ఫేర్‌వెల్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా చంద్రశేఖరరావు హాజరై మాట్లాడుతూ, ప్రతి విద్యార్థికీ క్రమశిక్షణ, కర్తవ్యం, నియమ నిబంధనలు అవసరమని నొక్కి చెప్పారు. ఇప్పటి నుంచే ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. సైన్స్‌ను నిజ జీవితానికి అన్వయించుకోవాలన్నారు. ప్రతి అంశాన్నీ సృజనాత్మకంగా ఆలోచించాలని పేర్కొన్నారు. జిసిడిఒ కలీషా బేగం మాట్లాడుతూ, ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి బహుమతులు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ గంగాకుమారి, ఉపాధ్యాయులు, ఎస్ఎంసి చైర్మన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఉల్లాస్ ద్వారా నిరక్షరాస్యులకు విద్య

ప్రజాశక్తి -ఆనందపురం : గ్రామాల్లో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి ఉల్లాస్ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని ఎంపిడిఒ డాక్టర్ వి.జానకి చెప్పారు. వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమం విద్యా సామాగ్రిని డ్వాక్రా, విఒఎలు, వాలంటీర్లకు గురువారం అందజేశారు. ఉల్లాస్ కార్యక్రమానికి సంబంధించి వాలంటరీ టీచర్లకు తరగతులను ఏ విధంగా నిర్వహించాలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జానకి మాట్లాడుతూ, అక్షరాస్యత కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ తరగతులను ప్రతి గ్రామంలోను నిర్దేశించిన ప్రాంతాల్లో రాత్రి 7 నుంచి 9 గంటల వరకూ నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఎపిఎం ఎస్.ఆదినారాయణ, విఒఎలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఉల్లాస్ ప్రోగ్రామ్‌పై మాట్లాడుతున్న ఎంపిడిఒ జానకి

సిపిఎం నాయకులు శ్రీనివాసరావుకు మాతృ వియోగం

బొడ్డేపల్లి భాగ్యలక్ష్మి (ఫైల్)

ప్రజాశక్తి -గాజువాక : సిపిఎం గాజువాక జోన్ నాయకులు, జనవిజ్ఞాన వేదిక, వార్వా నివాస్ నాయకులు బి.శ్రీనివాసరావు తల్లి బొడ్డేపల్లి భాగ్యలక్ష్మి (70) గురువారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న సిపిఎం జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, నాయకులు కె.కిరీటం, కె.సంతోషం, నాగేశ్వరరావు, స్టాలిన్ కొత్త గాజువాక పెట్రోల్ బంక్ వెనుక రాజీవ్‌నగర్ కాలనీలోని ఇంటికి వెళ్లి భాగ్యలక్ష్మి భౌతికకాయాన్ని సందర్శించారు. భాగ్యలక్ష్మి భర్త భాస్కరరావు 1982 నుంచి పార్టీ సానుభూతిపరులుగా ఉన్నారు. గాజువాకలో సిపిఎం చేపట్టిన అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. భాగ్యలక్ష్మి పార్టీ సభ్యులు కాకపోయినా, పార్టీ భావాలను కలిగి ఉండేవారని కుమారుడు శ్రీనివాసరావు ఈ సందర్భంగా తెలిపారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

మాధవస్వామి ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -గాజువాక : మాఘ పౌర్ణమి వేడుకలకు గంగవరం మత్స్యకార గ్రామం ముస్తాబవుతోంది. ఈ నెల 11 నుంచి నిర్వహించే శ్రీ మహాలక్ష్మీ మాధవ స్వామి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద్‌రెడ్డి గురువారం గంగవరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జాతరను తలపించేలా ఉత్సవాలు జరగాలన్నారు. అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గంగవరం ప్రాంతంలో దీర్ఘకాలిక సమస్యలన్నింటినీ దశల వారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నేతలు హరికృష్ణ, గంటా అబ్బాయి, నర్సింగ్, అమ్మోరు, మాధవరావు, దేముడు, పెంటయ్య, హరిబాబు, అప్పలరాజు, పేర్ల అప్పారావు, ముసలయ్య, గ్రామ కమిటీ, సిడబ్ల్యుసి కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఉద్యోగంలో చేరిక తేదీ తప్పులను సరిచేయించాలి

ప్రజాశక్తి -గాజువాక : ఉద్యోగంలో చేరిన తేదీ తప్పులను సరిచేయించి, సీనియార్టీకి సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ భెల్ హెచ్‌పివిపి గుర్తింపు నాయకులను ఉద్యోగులు, కార్మికులు గురువారం నిలదీశారు. ఈ సందర్భంగా కార్మికుల తరపున గోవింద్, ప్రసాద్ మాట్లాడుతూ, ఉద్యోగుల సీనియార్టీ సక్రమంగా ఉంటే తమకు పూర్తిస్థాయి పెన్షన్ వస్తుందని యూనియన్ నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్య పరిష్కారానికి యాజమాన్యం మీద ఒత్తిడి తీసుకురావాలని గుర్తింపు యూనియన్ నాయకులను కోరారు. దీనిపై గుర్తింపు యూనియన్ అధ్యక్షులు బి.బాబూరావు స్పందిస్తూ పిఎఫ్ ట్రస్టును సంప్రదించామని, 10 రోజుల గడువు కోరారని తెలిపారు. తదుపరి వివరాలన్నీ ఉద్యోగులకు తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులతో పాటు, గుర్తింపు యూనియన్ నాయకులు పివిఎన్.రాజు, కొల్లి దేవుడు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ వర్క్‌షాప్

ప్రజాశక్తి -గాజువాక : షీలానగర్‌లోని సిగ్నేచర్ హోటల్‌లో విశాఖలో ఎగుమతుల ప్రోత్సాహం, నిరాయ్ బంధు, ఎంఎస్ఎంఇ పథకాలపై నిర్వహించిన జాతీయ వర్క్‌షాపు గురువారం ముగిసింది. ఈ వర్క్‌షాపులో దువ్వాడ ఎస్ఇజెడ్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎస్ఇజెడ్‌లో ఉన్న ఉన్న వివిధ సదుపాయాలను వివరించారు. ఎంఎస్ఎంఇ ఈ సదుపాయాలను వినియోగించుకోవాలని కోరారు. విదేశీ వాణిజ్య అభివృద్ధి అధికారి ప్రకాష్‌సింగ్ మాట్లాడుతూ, నిరాయత్ బంధు పథకం గురించి ప్రత్యేకంగా వివరించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ వి.ఆదిశేషు, సీనియర్ బ్రాంచ్ మేనేజర్ చిరంతన్‌దత్త, ఎస్‌బిఐ ఎజిఎం ప్రభాత్ కుమార్ పలు విషయాలపై మాట్లాడారు. భారత విదేశీ వాణిజ్య సంస్థ, కస్టమ్స్ డిపార్ట్‌మెంట్, ఎగుమతి క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్, భారత పోస్ట్, ఎగుమతి తనిఖీ మండలి, ఎంపిఇడిఎ, ఎపిఇడిఎ, ఎఫ్ఐఇఒ, ఎస్‌బిఐ, నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు తమ పథకాల గురించి వివరించారు. ఈ వర్క్‌షాపులో 150 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

హయ్యర్ పెన్షన్‌కు అవకాశం లేదనడం అన్యాయం

పిఎఫ్ జాయింట్ కమిషనర్‌ను కలిసిన పెన్షనర్లు

ప్రజాశక్తి -ములగాడ : షిప్‌యార్డు విశ్రాంత ఉద్యోగులకు హయ్యర్ పెన్షన్ అవకాశం లేదనడం అన్యాయమని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.దీనబంధు, ఎస్‌కె.హుస్సేన్ పేర్కొన్నారు. హయ్యర్ పెన్షన్ విషయమై పిఎఫ్ జాయింట్ కమిషనర్ పవన్ జాస్తిని గురువారం వారు కలిసి మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ మంజూరైందని తెలిసిందని, తమకు ఎందుకు చెయ్యరని ప్రశ్నించారు. దీనిపై పవన్ జాస్తి స్పందిస్తూ స్టీల్‌ప్లాంట్ విశ్రాంత ఉద్యోగులకు హయ్యర్ పెన్షన్ లెక్కింపులకు ప్రధాన కార్యాలయం నుంచి తమకు ఆదేశాలొచ్చాయని తెలిపారు. హిందుస్థాన్ షిప్‌యార్డు, హెచ్‌పిసిఎల్, కోరమండల్‌కు హయ్యర్ పెన్షన్ వచ్చే అవకాశం లేదని, దీంతో ఆయా సంస్థలకు రిజెక్షన్ లెటర్‌ను ఆన్‌లైన్‌లో పంపామని ఆయన వివరించారు. డిసిసిబిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని, డ్రెడ్జింగ్ కార్పొరేషన్, భెల్ నుంచి సరైన సమాచారం రాకపోవడంతో అవి పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అనంతరం దీనబంధు, ఎస్‌కె.హుస్సేన్, మాట్లాడుతూ, చాలీచాలని పెన్షన్‌తో కుటుంబాలను పోషించుకోలేని పరిస్థితుల్లో విశ్రాంత ఉద్యోగాలు ఉన్నారని, ప్రభుత్వాలు తమ పట్ల చిన్నచూపు చూడడం తగదని అన్నారు. హయ్యర్ పెన్షన్ సాధించుకునే వరకూ పోరాటం ఆగదని స్పష్టంచేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ జిల్లా కమిటీ సభ్యులు కెపి.కుమార్, ఎన్.రామలింగేశ్వరరావు, వి.అప్పలరాజు, నారాయణరావు ఉన్నారు.

పెన్షనర్లకు కేంద్రం ఇబ్బందులు

ప్రజాశక్తి-సీతమ్మధార : 'ఉద్యోగుల పింఛను పథకం-95' పేరిట కేంద్ర ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి పాటుపడవలసింది పోయి, వారిని ఇబ్బందులకు గురిచేస్తుందని ఎపిఆర్ఎ రాష్ట్ర కార్యదర్శి కె.సుధాకరరావు ఆవేదన వ్యక్తంచేశారు. ద్వారకానగర్‌లోని విశాఖ పౌర గ్రంథాలయంలో స్టీల్ అథారిటీ విశ్రాంత అధికారులు, ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన గురువారం వార్షిక సమావేశం నిర్వహించారు. ఇటీవల కీర్తిశేషులైన విశ్రాంత ఉద్యోగులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సుధాకరరావు మాట్లాడుతూ, ఉద్యోగుల పిఎఫ్ ద్వారా ఒనగూడిన ధనం మీద వచ్చే వడ్డీలో మూడో వంతు కేటాయించినా పింఛన్ పెంపు సాధ్యమవుతుందన్నారు. పెన్షన్ పెంచాలని కోరుతూ ఈ నెల 11వ తేదీన ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద నిరసన, అనంతరం సభ నిర్వహించనున్నామని తెలిపారు. సమావేశానికి అధ్యక్షత వహించిన సంఘం అధ్యక్షుడు ఆడారి నాగరాజు మాట్లాడుతూ, సెయిల్ విశ్రాంత ఉద్యోగులుగా అతి తక్కువ పింఛను, అర కొర వైద్య సేవలతో శేష జీవితాన్ని గడుపుతున్నామని వాపోయారు. ఇకనైనా, కేంద్రం అలసత్వం వీడి, సత్వరమే తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి అండ్రాజు నారాయణరావు మాట్లాడుతూ, ఇపిఎస్-95 ఉద్యమం ఢిల్లీలోని తమ పోరాట సంఘాలైన ఎన్‌సిఆర్, ఎన్‌షిఒఎ ద్వారా కొనసాగుతోందని, అధిక పింఛను కోసం ఉన్నత న్యాయస్థానంలో కేసు నడుస్తోందని తెలిపారు. 2012 సంవత్సరం నుంచి హెచ్‌ఆర్ఎ ఏరియర్స్ చెల్లించాలని, ఇపిఎస్-95 పింఛన్ రూ.వెయ్యి నుంచి రూ.9 వేలకు పెంచాలని, ప్యానల్ హాస్పిటల్ ఓపిడి ఖర్చుల్ని రూ.4 వేల నుంచి రూ.20వేలకు పెంచాలని, ఇన్ పేషెంట్ ఖర్చులను రూ.8 లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచాలని, సెప్టెంబరు 2014కు ముందు రిటైర్ అయిన వారు, ఆ తరువాత రిటైర్ అయిన వారి మధ్య తేడా లేకుండా పింఛన్ పెంపు వర్తింపచేయాలని డిమాండ్‌చేశారు. అనంతరం సంస్థకు మీడియా సలహాదారుగా వ్యవహరిస్తున్న విశ్రాంత ఉద్యోగి బొల్లాప్రగడ సుబ్రహ్మణ్యాన్ని కార్యవర్గం సత్కరించింది. వృత్తి పరంగా విశేష సేవలందించిన సబ్బా విశ్వేశ్వరరావు, సివి.ధర్మారావు, పి.సీతారామారావు, ఎన్.రామలింగేశ్వరరావు, వై.జ్యోతిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిఆర్.మోహనరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

దామెర్ల పేరుతో అవార్డు ఇవ్వాలి

సమావేశంలో మాట్లాడుతున్న సుంకర చలపతిరావు

ప్రజాశక్తి-మాధవధార : ప్రముఖ చిత్రకారులు దామెర్ల రామారావు పేరుతో అవార్డు ప్రకటించాలని విశాఖ చిత్ర కళా పరిషత్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. కంచరపాలెంలోని బిఎన్ఆర్.భవన్‌లో గురువారం దామెర్ల శత వర్ధంతి సభ నిర్వహించారు. దామెర్ల చిత్రపటానికి చిత్రకారులు పూలమాల వేసి నివాళులర్పించారు. పరిషత్ అధ్యక్షులు డి.త్యాగరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. చిత్ర కళా విమర్శకులు సుంకర చలపతిరావు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని అనుసరించి రాజమహేంద్రవరంలో గల దామెర్ల గ్యాలరీని సాంకేతిక శాఖ నుంచి సాంస్కృతిక శాఖకు బదిలీ చేయాలని సమావేశం కోరింది. అనంతరం సీనియర్ చిత్రకారులు జిఎస్.ప్రకాష్‌ను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఎన్ఆర్ ఫౌండేషన్ కార్యదర్శి బుజ్జి, చిత్రకారులు సుధాకర్, బంగార్రాజు, పిసి.శేఖర్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

'విశాఖ'లో రోడ్డు సేఫ్టీపై అవగాహన

రోడ్డు సేఫ్టీపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బుచ్చిరాజు

ప్రజాశక్తి-వేపగుంట : విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్, బిసిడిఇ యూనిట్ల ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.బుచ్చిరాజు హాజరై మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. హెల్మెట్ ధరించకపోవడంతోనే ఇలా జరగుతుందని తెలిపారు. బాధ్యత కలిగిన పౌరులుగా రహదారి భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకపోయినా, హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపినా, ఒక ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణం చేసినా, మద్యం తాగి నడిపినా కఠిన చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ నిర్ణయించిందని తెలిపారు. అతివేగంగా వాహనం నడిపిన వారికి కూడ శిక్ష తప్పదని వివరించారు. ఈ మేరకు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జివి.ప్రదీప్‌వర్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చీటిమిరెడ్డి వీరునాయుడు, బిసిడిఇ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.డయానా, వివిధ విభాగాల అధిపతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్షణ లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, ఫ్యూజ్ బాక్స్

ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కరువు

ప్రజాశక్తి -ములగాడ : పారిశ్రామిక ప్రాంతం మల్కాపురం మరిడిమాంబ ఆలయ రహదారిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కరువైంది. ట్రాన్స్‌ఫార్మర్ల ఫ్యూజ్ కటవుట్లకు తలుపులు లేకుండా ఎర్త్ బిట్లు విరిగిపోయి ఉన్న దృశ్యాలు ఈ రహదారిలో సుస్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ రహదారి గుండా ఎన్నో పశువులు, వాహనదారులు, పాదచారులు తిరుగుతూనే ఉంటారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్లను నూతనంగా హైకెపాసిటీగా మార్చారు. అయినా భద్రతా చర్యలు చేపట్టలేదు. విద్యుత్ అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎన్నో గేదెలు, ఆవులు విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లను పర్యవేక్షించాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయునికి దేహశుద్ధి

- విద్యార్థిని పట్ల అసభ్యకర ప్రవర్తనపై బంధువుల ఆగ్రహం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన స్కూల్ యాజమాన్యం
- నిందితునిపై పోక్సో కేసు నమోదు

నిందితుడిని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్తున్న పోలీసులు

ప్రజాశక్తి-వడ్డాది

బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలోని ఎన్‌టిఎస్ ప్రైవేట్ స్కూల్లో విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయునికి బాధిత బాలిక బంధువులు గురువారం దేహశుద్ధి చేశారు. పాఠశాల యాజమాన్యం ఫిర్యాదు మేరకు నిందితునిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. వడ్డాదిలోని ఎన్‌టిఎస్ ప్రైవేట్ స్కూల్లో మ్యాథ్స్ టీచర్‌గా పని చేస్తున్న గంగాప్రసాద్ బుధవారం సాయంత్రం ట్యూషన్ సమయంలో పాఠశాలలోని ఓ గదిలో ముకుందపురం గ్రామానికి చెందిన 9వ తరగతి విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆ బాలిక తీవ్ర భయాందోళనతో గట్టిగా అరవగా, పాఠశాల సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. ఏడ్చుతున్న బాలిక పరిస్థితిని గమనించి సిబ్బంది తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారొచ్చి ఇంటికి తీసుకువెళ్లారు. బాలిక ఏడ్చుకుంటూ ఆందోళనతో తల్లిదండ్రులకు జరిగిన విషయాన్ని తెలియజేసింది. దీంతో తల్లిదండ్రులు, ముకుందపురం గ్రామస్తులు గురువారం ఉదయం పాఠశాలకు వచ్చి అందరి సమక్షంలో నిందిత ఉపాధ్యాయుడు గంగా ప్రసాద్‌కు దేహశుద్ధి చేశారు. పాఠశాల యాజమాన్యం ఇచ్చిన సమాచారం మేరకు ఎస్‌ఐ శ్రీనివాసరావు, పోలీసులు అక్కడికి చేరుకుని ఉపాధ్యాయుడిని పోలీసు స్టేషన్‌కి తరలించారు. విషయం తెలుసుకున్న డిఈఓ జి.అప్పారావునాయుడు, ఎంఈఓలు బొంజిబాబు, కాశీవిశ్వేశ్వరరావు, సిఐ కోటేశ్వరరావు పాఠశాలకు చేరుకొని జరిగిన సంఘటనపై అడిగి తెలుసుకున్నారు. పాఠశాల యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితునిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. కాగా నిందిత ఉపాధ్యాయుడు గంగా ప్రసాద్ మండలంలోని వడ్డాది ఎన్‌టిఎస్ పాఠశాలతో పాటు పిఎంఎన్ మోడల్ స్కూలు, బుచ్చయ్యపేటలోని జాజిమొగ్గల హైస్కూల్లో కూడా పని చేస్తున్నట్లు తెలిసింది.

తల్లిదండ్రుల్లో భయాందోళనలు

విద్యార్థిని పట్ల ఉపాధ్యాయుడు గంగా ప్రసాద్ అసభ్యకర ప్రవర్తన సభ్య సమాజం తలదించుకునేలా చేసింది. ఈ ఘటనతో విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనలు చెందుతున్నారు. తమ పిల్లలను ఆ పాఠశాలకు పంపించేందుకు భయపడుతున్నారు. స్కూల్లో చిన్నారులకు భద్రత కల్పించలేనందుకు ఎన్‌టిఎస్ స్కూల్ యాజమాన్యంపై తల్లిదండ్రులు మండిపడుతున్నారు. స్కూల్ ముగిసిన తర్వాత ట్యూషన్లు నిర్వహిస్తూ పిల్లల భద్రతపై శ్రద్ధ వహించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు స్కూళ్లపై విద్యాశాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పటిష్ట చర్యలు తీసుకుంటాం : స్కూల్ కరస్పాండెంట్

తమ స్కూల్లో ఎప్పుడూ ఇటువంటి సంఘటనలు జరగలేదని ఎన్‌టిఎస్ స్కూల్ కరస్పాండెంట్ రామరాజు అన్నారు. బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన టీచర్ని కఠినంగా శిక్షించాలని ఫిర్యాదు చేశామని చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎన్‌టిఎస్ స్కూల్ అనుమతులు రద్దు చేయాలి : ఎస్ఎఫ్ఐ

అనకాపల్లి : పడ్డాదిలో ఎన్‌టిఎస్ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని పట్ల ఆ పాఠశాల ఉపాధ్యాయుడి అసభ్యకర ప్రవర్తన సిగ్గుచేటని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ నిందిత ఉపాధ్యాయుడిపై తగు చర్యలు తీసుకోవాలని, పాఠశాల అనుమతిని రద్దు చేయాలని, బాధిత విద్యార్థినికి తగు న్యాయం చేయాలని చరవాణి ద్వారా డిఇఒ అప్పారావునాయుడుకు విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. అధికారులు తమ డిమాండ్లపై చర్యలు తీసుకోకుంటే పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. నిర్భయ, దిశ చట్టాలను అమలు చేయడంలో ప్రభుత్వం, హోంమంత్రి అనిత విఫలం కావడం వల్లే ఇటువంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని పేర్కొన్నారు. హోం మంత్రి సొంత జిల్లాలో ఇటువంటి ఘటనలు ఎక్కువ జరగడమంటే ఆమె నేరస్తులకు కాపు కాసినట్టుగా భావించాల్సి వస్తోందన్నారు. ఇప్పటివరకు జరిగిన సంఘటనలపై ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ఎటువంటి చర్యలు చేపట్టారో బహిరంగ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయ వృత్తికే సిగ్గు చేటు : ఐద్వా

అనకాపలి : పిల్లలకు మంచిగా తీర్చి దిద్దవలసిన టీచర్లు ఇలాంటి పనులు చేయడం ఉపాధ్యాయుడు వృత్తికే సిగ్గుచేటని ఐద్వా జిల్లా కార్యదర్శి డిడి.వరలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వడ్డాదిలో బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయునిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఎన్ని చట్టాలున్నా మహిళలు, చిన్నారులపై దాడులు ఆగటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఎలమంచిలి మండలంలోనూ ఇటువంటి సంఘటనే చోటుచేసుకుందన్నారు. హోంమంత్రి సొంత జిల్లాలో 20 రోజుల వ్యవధిలో రెండు సంఘటనలు జరగడం శోచనీయమన్నారు. మహిళలకు, చిన్నారులకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి సంఘటనలపై ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ వేగవంతం చేసి దోషులకు కఠినంగా శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దైవజ్ఞను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్య ప్రతినిధులు

యోగాలో సెయింట్ జాన్స్ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-కశింకోట : ఇటీవల శివ జ్యోతి యోగా కేంద్ర వారి ఆధ్వర్యంలో జరిగిన ఆన్లైన్ యోగ పోటీలలో కశింకోట సెయింట్ జాన్స్ స్కూల్లో మూడవ తరగతి చదువుతున్న ఎం.దైవజ్ఞ తన ప్రతిభను కనబరిచి యోగా ప్రతిభ అవార్డును కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా పాఠశాలలో గురువారం స్కూల్ కరస్పాండెంట్ బత్తులు అనురాధ అభినందించారు. చిన్న వయసులోనే ఇంత ప్రతిభను కనపర్చిన చిన్నారి దైవజ్ఞను, ప్రోత్సహిస్తున్న తల్లితండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ రూపానంది పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో అన్యాయంపై సిపిఎం నిరసన

ప్రజాశక్తి-సబ్బవరం : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు కోతపై సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు ఉప్పాడ సత్యవతి మాట్లాడుతూ కేంద్రం బడ్జెట్‌లో మోడీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మొండి చెయ్యి చూపించిందన్నారు. ప్రత్యేక హోదా ఊసే లేదని, విభజన హామీలు పక్కన పెట్టి రాష్ట్రానికి ద్రోహం చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో దుర్గాంబ కళాసి సంఘం అధ్యక్షులు బర్ల రమణ, నూకరాజు, దేముడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్చరీలో గణేష్‌కు కాంస్యం

ప్రజాశక్తి-పరవాడ : ఉత్తరాఖండ్‌లో జరిగిన 38వ జాతీయ ఆర్చరీ పోటీల్లో తిరుమూరు గణేష్ మణిరత్నం కాంపౌండ్ పురుషుల వ్యక్తిగత ఆర్చరీ ఈవెంట్‌లో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. కానో స్లాలోమ్ ఉమెన్స్ (కె-1) ఈవెంట్‌లో మిక్స్‌డ్ కాంపౌండ్ ఆర్చరీ ఈవెంట్‌లో రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. వారి అత్యుత్తమ ప్రదర్శనకు గాను విశాఖపట్నం ఆటగాడు గణేష్ మణిరత్నంకు జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి. సూర్యనారాయణ రెడ్డి, సెక్రటరీ కె.నిశాంత్, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, కోశాధికారి భాస్కర్, సంస్కృతి గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్. సీతాలక్ష్మి, వైజాగ్ ప్రొఫైల్స్ అధినేత వి.కృష్ణారావు, ఆర్‌కె హాస్పిటల్ అధినేత వి.కృష్ణమూర్తి, డాక్టర్ యామిని తదితరులు అభినందనలు తెలిపారు.

వైసిపి యువజన విభాగం అధ్యక్షునిగా జగ్గారావు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ఎలమంచిలి నియోజకవర్గ అధ్యక్షుడిగా శరగడం జగ్గారావును కేంద్ర పార్టీ నియమించింది. ఈ మేరకు నియామక పత్రాన్ని జగ్గారావుకు పంపించారు. జగ్గారావు నియామకం పట్ల నియోజకవర్గంలో పలువురు హర్షం తెలిపారు. మహిళా విభాగం అధ్యక్షురాలుగా రాజాన చిట్టెమ్మ, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులుగా బలిరెడ్డి శ్రీను తదితరులను నియమించారు.

పెద్దాపురం నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకునిగా సాయికృష్ణ

ప్రజాశక్తి-మునగపాక : ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పెద్దాపురం నియోజకవర్గ పరిశీలకునిగా టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సాయికృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్పను ఆయన నివాసంలో గురువారం సాయికృష్ణ కలిశారు. ఎన్నికల వ్యూహంపై చర్చించారు. కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం గెలుపునకు శాసనసభ్యులు చినరాజప్ప నేతృత్వంలో కృషి చేయనున్నట్లు సాయికృష్ణ తెలిపారు. అనంతరం ఆయన సామర్లకోటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

పెద్దాపురం ఎమ్మెల్యే చిన రాజప్పను కలిసిన సాయికృష్ణ

రైతులకు వ్యవసాయ ఆధారిత సూచనలు

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లా రైతాంగానికి స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు పలు సూచనలు అందించారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్‌లో జిల్లా రైతాంగానికి వ్యవసాయ ఆధారిత సూచనలు సమావేశం ఏడిఆర్ డాక్టర్ సిహెచ్ ముకుందరావు అధ్యక్షతన గురువారం జరిగింది. ప్రస్తుత వరిలో ఆకుముడుత, కాండం తొలుచు పురుగు ఆశిస్తుందని నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా క్లోరంట్రానిలిప్రోల్ 0.3 మిల్లీ లీటర్లు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలని సూచించారు. అపరాల్లో రసం పీల్చు పురుగు ఉధృతి పెరిగి పల్లాకు తెగులు వ్యాపించే అవకాశం ఉన్నందున తెగులు సోకిన మొక్కలను పీకి నాశనం చేయాలన్నారు. నివారణకు డైమిథోయేట్ రెండు మిల్లీ లీటర్లు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలని కోరారు. పూత దశకు వచ్చిన వేరుశనగ పంటలో ఎకరాకు 200 కిలోలు జిప్సం వేయాలన్నారు. చెరుకులో కొరడా తెగులు ఆశిస్తే కార్బి చేసిన వెంటనే గ్రప్రొపికొనజోల్ ఒక మిల్లీ లీటర్ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలన్నారు. చెరకు మొక్క తోటలో కలుపు నివారణకు అట్రాజిన్ 50 శాతం పొడి మందును ఎకరాకు రెండు కిలోల, లేదా మెట్రిబుజిన్ 600 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పొలమంతా పిచికారి చేయాలని సూచించారు. చెరుకులో పీక పురుగు ఉధృతి నివారణకు ఎకరాకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు 13 కిలోలు చాళ్లలో 1:2 నిష్పత్తిలో ఇసుకతో కలిపి వేసుకోవాలన్నారు. మామిడి పూత దశలో పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలని కోరారు. జీడి మామిడిలో టిదోమ నివారణకు మోనోక్రోటోఫస్ 1.6 మిల్లీలీటర్లు, కాపర్ ఆక్సి క్లోరైడ్ 2.5గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. సమావేశంలో శాస్త్రవేత్తలు టి శ్రీలత, కెవి రమణమూర్తి, వి గౌరీ, బి భవాని, వి చంద్రశేఖర్, పివీ పద్మావతి, ఏ అలివేణి పాల్గొన్నారు.

ప్రమాద బాధితున్ని ఆదుకోవాలి

స్పాన్‌లైఫ్ సైన్సెస్ కంపెనీ ఎదుట క్షతగాత్రునితో కలిసి బంధువుల ఆందోళన

కంపెనీ ముందు ఆందోళన చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-రాంబిల్లి : ఎస్ఇజెడ్ పరిధిలోని స్పాన్‌లైఫ్ సైన్సెస్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్‌లో జనవరి 24న జరిగిన ప్రమాదంలో కాలు నుజ్జు నుజ్జు అయిన బాధితుడిని ఆదుకోవాలని కోరుతూ కంపెనీ మెయిన్ గేట్ ముందు గురువారం బాధితునితో కలిసి బంధువులు ఆందోళన చేపట్టారు. వీరికి మద్దతు తెలియజేసిన సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.దేవుడునాయుడు మాట్లాడుతూ అచ్యుతాపురం మండలం, ఇరువాడ గ్రామానికి చెందిన నాగల ఆనంద్ జనవరి 24న కంపెనీలో ఎలక్ట్రిషన్ వర్క్ చేస్తున్న సమయంలో లిఫ్ట్ ప్రాబ్లం ఉందని చూడటానికి వెళ్లాడని చెప్పారు. ఆ సమయంలో లిఫ్ట్ చైన్ తెగిపడిపోవడంతో ఆనంద్ ఎడమ కాలు కింద భాగమంతా నుజ్జు అయిపోయిందని తెలిపారు. అయితే యాజమాన్యం వైద్యం చేయించి కార్మికుడిని వదిలేసిందని, దీంతో ఆనంద్ తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడని పేర్కొన్నారు. క్షతగాత్రుడైన ఆనంద్‌కు మెరుగైన వైద్యం అందించాలని, తను కోలుకునే పూర్తి జీతం ఇవ్వాలని, తరువాత కంపెనీలో ఆయన చేయగలిగిన పని కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే వన్ టైం సెటిల్మెంట్ కింద రూ.50 లక్షలు నష్టపరిహారం చెల్లించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఆనంద్ మీద ఆధారపడి భార్య, తల్లిదండ్రులు ఉన్నారని, 26 సంవత్సరాలు వయసులో ఇంతటి ప్రమాదం జరిగితే మేము ఎలా బతకాలని కుటుంబ సభ్యులు కంపెనీ గేటు ముందు కన్నీరు మున్నీరయ్యారు. కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యం వీడి, ఆనంద్ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని, లేకుంటే కార్మికశాఖ అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వై.రాము, బాధితుని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాడి రైతుకు పశు బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి అచ్యుతాపురం : మండలంలోని ఎం.జగన్నాధపురం గ్రామంలో విశాఖ డెయిరీ పాల కేంద్రంలో గురువారం గొర్లి నాగేశ్వరరావు అనే పాడి రైతుకు పశుబీమా పథకం కింద మంజూరైన రూ.50 వేలు చెక్కును సంఘ అధ్యక్షులు సేనాపతి వంశీ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పీలా కాసుబాబు, భీమిని నాయుడు, బుదిరెడ్డి చిరంజీవి, వజ్రపు సూరిబాబు, పాలసంఘం వేతన కార్యదర్శి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సర్పంచ్ దాడి జగన్నాథం

ఎం.అలమండ సర్పంచ్ సస్పెన్షన్‌పై హైకోర్టు స్టే

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని ఎం.ఆలమండ గ్రామ సర్పంచ్ దాడి జగన్నాథం సస్పెన్షన్‌పై హైకోర్టు స్టే విధించింది. సర్పంచ్‌పై ఆరోపణలు చేస్తూ ఇదే గ్రామానికి చెందిన గొర్లె గోవింద 2024 జూన్ 26న ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిగింది. విచారణాధికారుల నివేదిక ఆధారంగా సర్పంచ్‌ను మూడు నెలల పాటు సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టరు విజయకృష్ణన్ గత నెలలో ఆదేశాలిచ్చారు. కలెక్టరు ఇచ్చిన సస్పెన్షన్ ఉత్వర్వులపై సర్పంచ్ జగన్నాథం హైకోర్టును ఆశ్రయించారు. సర్పంచ్ వేసిన రిట్ పిటిషన్‌పై విచారించిన హైకోర్టు సర్పంచ్ సస్పెన్షన్‌పై స్టే విధించింది. దీనిపై 4 వారాల్లోగా కౌంటరు దాఖలు చేయాలని అధికారులకు హైకోర్టు గడువు విధించింది. తన సస్పెన్షన్‌పై కోర్టు స్టే విధించడం పట్ల సర్పంచి దాడి జగన్నాథం హర్షం వ్యక్తం చేశారు. ఎం.అలమండలో తన మద్దతుదారులతో కలిసి గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను ఏ తప్పు చెయ్యలేదని, తనపై ఎవరెన్ని ఆరోపణలు చేసినా, చివరకు ధర్మమే గెలుస్తుందన్న ధీమా వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో ఉప సర్పంచి గంగాధర్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ప్రసాదు, వార్డు సభ్యుడు గోవింద, పాల సంఘ అధ్యక్షుడు రమణ తదితరులు పాల్గొన్నారు.

'ఆలయ ధర్మకర్తగా నేనే వస్తా'

ప్రజాశక్తి-వడ్డాది : వచ్చే ఏడాది ఉత్సవాల నాటికి బుచ్చయ్యపేట మండలం వడ్డాది వెంకటేశ్వర స్వామి ఆలయ వంశపారంపర్య ధర్మకర్తగా తానే వస్తానని పిఏసిఎస్ మాజీ అధ్యక్షుడు దొండా సన్యాసిరావు అన్నారు. గురువారం ఆయన బంగారు మెట్టలో విలేకరులతో మాట్లాడారు. తమ కుటుంబ సభ్యుడైన ప్రస్తుత ధర్మకర్త దొండా కన్నబాబు ఉత్సవాల నిర్వహణలో విఫలమయ్యారని ఆరోపించారు. తన సోదరుడిపై వ్యక్తిగత ద్వేషం లేదని, కేవలం ఆలయం అభివృద్ధి చెందాలని ఉద్దేశమని తనకుందని చెప్పారు. తన తండ్రి దొండా వెంకటరమణ, ఆయన తండ్రి శ్రీరామ్మూర్తి, వారి సోదరుడు దొరబాబుల హయాంలో వడ్డాది వెంకన్న ఉత్సవాలు ఎంతో వైభవంగా జరిగాయని తెలిపారు. వంశపారంపర్య ధర్మకర్తగా పనిచేసే అవకాశం హక్కు తనకు కూడా ఉందన్నారు. వచ్చే ఏడాది ఉత్సవాల నాటికి ధర్మకర్తగా తన పేరిట ప్రభుత్వం నుండి ఉత్తర్వులు తెచ్చుకుంటానని చెప్పారు. దమ్ముంటే అడ్డుకోవాలని కన్నబాబుకు సవాల్ విసిరారు. ఆలయంలో జరిగిన అక్రమాలపై రాష్ట్ర దేవాదాయ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు కుబిరెడ్డి వెంకట్రావు, వీర్ల సురేష పాల్గొన్నారు.

కిరాణా షాపులో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని బోయిల కింతాడ గ్రామంలో బుగత రవణమ్మకు చెందిన కిరాణా షాప్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గురువారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం జరిగింది. కిరాణా షాపుల్లో ఉన్న సామాన్లు, రూ.40 వేలు నగదు కాలిబూడిదైనట్లు బాధితురాలు విలపించింది. విషయం తెలుసుకున్న తెలుగు రైతు ఆర్గనైజింగ్ కార్యదర్శి కడిమి నాగేశ్వరరావు రెవెన్యూ అధికారులకు సమాచారం తెలియజేశారు. దీంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి బాధితురాలికి న్యాయం చేస్తామని నాగేశ్వరరావు తెలిపారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన సురేంద్ర

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ఆంధ్రప్రదేశ్ గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీసీలకు నామినేటెడ్ పోస్టుల్లో 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కేబినెట్ ఆమోదం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఎన్నికలముందు జాతీయ బిసి సంక్షేమ సంఘానికి ఇచ్చిన హామీ నెరవేర్చారని, బిసిలకు రక్షణ చట్టం గురించి మంత్రి వర్గంలో చర్చ, చట్టసభల్లో బీసీలకు 34 శాతం కులగణన గురించి కేంద్రానికి చంద్రబాబు లేఖ రాయడం మంత్రి వర్గం ఆమోదం తెలపడం చాలా ఆనందం కలిగించాయని తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం తథ్యం

విఎస్ఇజెడ్ జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ రోషిని అపరంజి

ప్రజాశక్తి-అనకాపల్లి

విద్యార్థులు ప్రణాళికబద్ధంగా కష్టపడి చదివితే తప్పక విజయం సాధిస్తారని విఎస్ఈజెడ్ జాయింట్ డెవలప్మెంట్ కమిషనర్ రోషిని అపరంజి కోరాటి పేర్కొన్నారు. స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలను స్థాపించి 18 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రెండు రోజులపాటు నిర్వహించే వైబ్రెంట్ డైట్-2025 వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాలల నుంచి బాలికలు 60 శాతం మంది ఉత్తీర్ణులై బయటకొస్తున్నా, వారిలో 40 శాతం మంది మాత్రమే ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. మిగిలిన వారు పెళ్లి తదితర కారణాలతో మధ్యలోనే ఉద్యోగాలను వదిలి వేస్తున్నారన్నారు. ఇది సరైన పద్ధతి కాదని, తమ జీవితకాలం ఉద్యోగాల్లో కొనసాగి అభివృద్ధి సాధించాలని సూచించారు. మన విజయానికి సమాజంలో ఎంతోమంది కారకులు అవుతున్నారని, మనం ఉద్యోగం పొందిన తర్వాత సమాజానికి కూడా సేవ చేయాలన్నారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ తమ కళాశాలలో పరిశ్రమలకు అవసరమైన రీసెర్చ్, సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో అందిస్తున్నామన్నారు. జాతీయస్థాయిలో గొప్ప ఆవిష్కరణలతో 14 సంవత్సరాలుగా తమ కళాశాల నాల్గవ స్టార్ ర్యాంకింగ్‌లో కొనసాగుతుందన్నారు. ప్రస్తుత సాంకేతిక రంగంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్ ముఖ్య పాత్ర వహిస్తుందన్నారు. విద్యార్థులందరికీ అందుకు సంబంధించిన శిక్షణ ఇవ్వడం, దాని ఆధారంగా విద్యార్థులు పరిశోధన విభాగంలో పరిశోధన పత్రికలను, బుక్ చాప్టర్స్‌ని ప్రచురిస్తున్నారని తెలిపారు. గౌరవ అతిథి శ్రీరామ్ పెంటకోట ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

రోషిణి అపరంజిని సత్కరిస్తున్న కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠ రావు 2024-25 సంవత్సరానికి సంబంధించి కళాశాల జాతీయ స్థాయిలో సాధించిన విజయాలను, అభివృద్ధి వార్షిక నివేదికను వివరించారు. చివరగా ఉద్యోగాలు వచ్చిన విద్యార్థులకు, అకడమిక్ టూపర్స్, వారి తల్లిదండ్రులకు సన్మానం చేశారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు.

తామరబ్బ పాఠశాలను

ఆశ్రమ హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలి

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని తామరబ్బ యూపి పాఠశాలను హాస్టల్‌తో కూడిన ఆశ్రమ హైస్కూల్‌గా అప్ గ్రేడ్ చేసి గిరిజనులకు మెరుగైన విద్యను అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి బిటి.దొర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ తామరబ్బ పంచాయితీలో 9 గిరిజన గ్రామాలు, చింతలపూడి పంచాయతీలో 11 గ్రామాలు ఉన్నాయని, వీటి పరిధిలో 7 ప్రాథమిక పాఠశాలలు, ఒకటి యుపి స్కూల్ ఉన్నట్లు చెప్పారు. ఈ పాఠశాలల్లో ఐదో తరగతి పూర్తయిన తరువాత హైస్కూల్ విద్య కోసం, తామరబ్బ యూపీ స్కూల్‌లో 7వ తరగతి వరకు చదువుకొని తరువాత తరగతుల కోసం దూర ప్రాంతాలకు వెళ్ళ వలసి వస్తుందని తెలిపారు. యూపీ స్కూల్‌పై ఎక్కువ మంది మొగ్గు చూపడం లేదని, దీంతో అత్యధిక మంది చదువులకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పంచాయితీలో చదువుకొని ఉపాధి పొందిన వారు చాలా తక్కువ మంది ఉన్నారన్నారు. గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య అందాలంటే తామరబ్బ యూపీ స్కూల్‌ను హాస్టల్‌తో కూడిన ఆశ్రమ హైస్కూల్‌గా అప్ గ్రేడ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జె.ఈశ్వరరావు, తామర్ల శంకర్రావు, వి.దొంగబాబు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-సబ్బవరం : సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక సిఐ పిన్నింటి రమణ అన్నారు. మొబైల్ ఫోన్లలో తెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింక్లు ఓపెన్ చేయొద్దని హితవుపలికారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద గురువారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ దాసరి రాజశేఖర్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై విభూతి బ్రదర్స్ వారిచే కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ పిన్నింటి రమణ మాట్లాడుతూ బ్యాంకు అధికారులమని, రుణం మంజూరు చేస్తామని, రుణమాఫీ వస్తుందని, కేవైసీ అప్డేట్ చేయాలని, మీకు తెలియని లింకులు పంపిస్తే ఓపెన్ చేయవద్దని సూచించారు. మానవ తప్పిదం వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఎస్బిఐ మేనేజర్ రాజశేఖర్ మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు మీకు ఫోన్ చేసి మీ ఏటీఎం, పిన్ నెంబర్, సీవీఏ బ్యాంకు ఖాతా తదితర వివరాలు అడితే ఇవ్వరాదని సూచించారు. ఇలాంటి మోసాలకు చెక్ పెట్టడానికి ఎస్బిఐ టోల్ ఫ్రీ నెంబర్ 18001234 పెట్టిందని చెప్పారు. ఎవరికైనా సైబర్ నేరం జరిగితే వెంటనే ఈ నెంబర్‌కి ఫోన్ చేసి చెప్తే మీ ఎకౌంటు ఖాతా బ్లాక్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్బిఐ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ చంద్రశేఖర్, అఖిల్, పోలీసులు సిబ్బంది, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న నాయకులు

ఘనంగా గాధాలమ్మ తల్లి పండగ

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని తాణాం గ్రామంలో రజకులు వీధిలో శ్రీగాధాలమ్మ తల్లి పండుగ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. తాణాం గ్రామ సర్పంచ్ కన్నూరు దేవివెంకటరమణ, మాజీ జెడ్పీటీసీ సభ్యులు పైలా జగన్నాథరావు, వైస్ ప్రెసిడెంట్ వర్రి మంగ లక్ష్మి అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రొంగలి అప్పారావు లక్ష్మి, ఉత్సవ్ కమిటీ సభ్యులు పైల కృష్ణారావు, డిఎంఎల్ నాయుడు, అడ్డూరి శంకర్, అడ్డూరి అప్పారావు, అడ్డూరి రాజు, అడ్డూరి శ్రీను, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అడవి రాజులు పండగ

కశింకోట : మండలంలోని బంగారయ్యపేట, గొల్లపేట వద్ద అడవిరాజులు పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఉదయం ఎంపీటీసీ లగిశెట్టి భవాణి గణేష్ దర్శనం చేసి పూజలు చేశారు. వారిని ఆలయ కమిటీ సన్మానించింది. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు కాయలు మురళి, నిమ్మదల సన్యాసినాయడు, ఒమ్మి సత్య నారాయణ, అప్పికొండ అప్పారావు పాల్గొన్నారు.

సచివాలయంలో ఇఒపిఆర్‌డి తనిఖీ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని తైపురం గ్రామ సచివాలయంలో ఈఒపిఆర్‌డి విజయలక్ష్మి గురువారం తనిఖీ చేశారు. సిబ్బందితో సమావేశమై విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మూతపడిన ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాలు

తెరిపించాలని పలువురు వేడుకోలు

ప్రజాశక్తి-కె.కోటపాడు

పేదలకు ఎంతో ఉపయోగపడిన ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాలు ఆరు నెలలుగా మూతపడ్డాయి. 2014లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో ప్రత్యేకంగా ఈ-ఐ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వృద్ధులు నిరుపేద కంటి రోగులు ఈ కేంద్రాలను నూరు శాతం వినియోగించుకునేవారు. ఇక్కడ ఏర్పాటు చేసిన అధునాతన వైట్రోస్కోప్, స్లిప్ లాంప్ తదితర పరికరాలతో కంటి పనితీరు అంచనా వేసేవారు. వాటి ద్వారా అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందజేయడం, కంటి ఆపరేషన్లకు సిఫార్సు చేయడం చేసేవారు. తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం కూడా ఈ కేంద్రాలను కొనసాగించింది. అయితే ఆరు నెలల నుండి ఈ కేంద్రంలో ఉన్న పరికరాలను తరలించేశారు. ఈ కేంద్రంలో కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ వైదేహి ఒక టెక్నీషియన్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. కంటి పరీక్షలు, ఉచిత కళ్లద్దాలు పంపిణీ లేకపోవడంతో రోజుకు పదిమందిలోపే ఓపి ఉంటుంది. ఈ విషయమే డాక్టర్ వైదేహి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఈఐ కేంద్రాల పరిస్థితిపై స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. కంటి ఆపరేషన్లు ఇక్కడే

నిర్వహించుకోవచ్చునని, దీనికి ప్రత్యేకంగా ఒక ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేయవలసి ఉంటుందని తెలిపారు. గతంలో చంద్రబాబునాయుడు ప్రారంభించిన ఈ కేంద్రాలు మళ్ళీ ఆయన హయాంలోనే మూసివేయడం బాధాకరమని, వాటిని వెంటనే తెరిపించాలని పలువురు కోరుతున్నారు.

పయనీర్ ముడి సరుకు లారీలను అనుమతించం

- తేల్చిచెప్పిన పలు గ్రామాల ప్రజలు

లారీ యజమానులు, గ్రామస్తులతో చర్చిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి -కోటవురట్ల:మాకవరపాలెం మండలం లోని పయనీర్ అన్‌రాక్ రిఫైనరీ కంపెనీ నుండి భారీ వాహనాలతో రోడ్లన్నీ ధ్వంసం కావడంపై బుధ, గురువారాలు సమీప ప్రాంత గ్రామాలకు చెందిన పలువురు భారీ వాహనాలను అడ్డుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు విశాఖ అనకాపల్లి జిల్లా లారీ సంఘం యజమానులు, అధ్యక్షులు గురువారం గ్రామస్తులతో స్థానిక సీఐ రేవతమ్మ ఆధ్వర్యంలో చర్చలు చేపట్టారు.ముడి సరుకు తీసుకు వచ్చే లారీలను అనుమతించేది లేదని గ్రామస్తులు తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా టిడిపి నాయకుడు అల్లు రామనాయుడు మాట్లాడుతూ, విశాఖ పోర్ట్ నుండి పయనీర్ రిఫైనరీ కంపెనీకి భారీ వాహనాలు నిత్యం వందలాదిగా తరలివస్తూ ఉండడంతో రోడ్లన్నీ ధ్వంసం అవ్వడమే కాకుండా మితిమీరిన వేగంతో వెళ్లడంతో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్న తరుణంలో లారీలను అడ్డుకోవడం జరుగుతుందని తెలిపారు. తాళ్లపాలెం వద్ద ఉన్న వంతెన దెబ్బతినే అవకాశం ఉన్నందున భారీ వాహనాలు నడపకుండా అడ్డుకుంటామని తాళ్లపాలెం, రహదారులు, వంతెనలు ధ్వంసం అయితే విశాఖపట్నం -అనకాపల్లి -అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రాలకు వెళ్లే ప్రజలంతా తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు, అదేవిధంగా పయనీర్ కంపెనీ నుండి పరిమితికి మించి లోడు తో దుమ్ము దూలి, శబ్ద కాలుష్యంతో వస్తున్న లారీల కారణంగా తీవ్ర భయాందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కంపెనీ నుంచి విపరీతమైన ధూళి కణాలలతో కూడిన పొగ కారణంగా సమీప ప్రాంత వాసులను దృష్టిలో ఉంచుకొని యాజమాన్యం తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు, సుదీర్ఘ మంతనాల అనంతరం ఖాళీ లారీలను తిరిగి వెనక్కి పంపించారు. స్థానిక ఎస్సై దామోదర్ రావు వివిధ గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

సిఐలతో మాట్లాడుతున్న ఎస్పి

పోలీస్ స్టేషన్‌లో తనిఖీలు

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి పోలీస్ స్టేషన్ ను గురువారం జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పాత కేసులకు సంబంధించిన వివరాలను సిఐలు కుమారస్వామి, రామకృష్ణ, ఎస్ఐ సన్నిబాబులను అడిగి తెలుసుకున్నారు. హత్యలు, మిస్సింగ్, గంజాయి కేసులు పై ఆరా తీశారు. 2019లో కాగిత- అమలాపురం రహదారి మధ్య జరిగిన గుర్తు తెలియని వ్యక్తి హత్య కేసు, మిస్సింగ్ కేసులకు సంబంధించిన వివరాలు సేకరించాలని ఆదేశించారు. అనంతరం స్టాఫ్‌తో మాట్లాడారు. యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు.

సంపద తయారీ కేంద్రాలను పూర్తి చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని పెదబోదిగల్లం, ఉపమాక పంచాయితీ గ్రామాల్లో ఉన్న చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను గురువారం ఎంపీడీవో డి.సీతారామరాజు, ఇంచార్జ్ ఈవోపీఆర్డి ఎం.శ్రీను తనిఖీ చేశారు. సంపద కేంద్రాలను వాడుకలోకి తీసుకువచ్చి పంచాయతీలకు సంపద సృష్టించు కోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న షెడ్డులు నిర్మాణాలను, మైనర్ రిపేర్లను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెదబోదిగల్లం పంచాయతీ సర్పంచ్ ఫాతిమా మున్నిషా బేగం, పంచాయతీ కార్యదర్శి జయ ప్రకాష్ పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న అధికారులు

అవగాహన కల్పిస్తున్న సర్పంచ్

'ఉపాధి హామీ'పై అవగాహన

ప్రజాశక్తి -రావికమతం:ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దాసరి సూర్య కుమారి తెలిపారు. మండలంలో కవగుంట గ్రామంలో కొత్త చెరువులో పనిచేస్తున్న ఉపాధి కూలీలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామంలో ఉపాధి పనికి వచ్చే ప్రతి వ్యక్తికి జాబు కార్డు కల్పించడంతో పాటు వంద రోజుల పని కూడా కల్పించడం జరుగుతుందన్నారు. రోజుకు 300 రూపాయల చొప్పున 100 రోజులు పనులు పొందాలన్నారు. గ్రామంలో ప్రజలు వేరే గ్రామానికి వలస వెళ్లకుండా ఉండేందుకుగాను మన గ్రామంలోనే పని చేసుకోవాలన్నారు. పలు రకాల పనులన్నీ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టు కోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మేట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని పాకల పాడు గ్రామంలో పిల్లి చిన్నోడు, లక్ష్మీ, గండబోయిన రాము, గండిబోయిన నూకాలమ్మ దంపతుల ఆర్థిక సహకారంతో దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర మాట్లాడుతూ, గ్రామంలో ఇటువంటి కార్యక్రమాలతో ఆధ్యాత్మికత సంతరించు కుంటుందన్నారు. ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల ప్రధాన కార్యదర్శి సలాదుల ప్రసాద్‌బాబు, నాతవరం మండల నాయకులు ప్రగడ కృష్ణబాబు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.10 వేలు వితరణ

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలోని ఎం.కోడూరు గ్రామ దేవత మోదకొండమ్మ అమ్మవారికి మాడుగుల గ్రామానికి చెందిన కీర్తిశేషులు నూతిగట్టు సర్వేశ్వరరావు జ్ఞాపకార్థం కుమారుడు నాగ శంకర్, రామలక్ష్మి దంపతులు ఆలయ అభివృద్ధి నిమిత్తం 10 వేలను గురువారం ఆలయ కమిటీ చైర్మన్ గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావుకు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు శ్రీనాథ్ శ్రీనివాసరావు, పడాల అప్పలనాయుడు, ముమ్మిన రమణ బాబు, గెంజి రాజేష్ కుమార్, కలిమి గోపాల్, శివ, పోతిన జగదీష్, జొన్నపల్లి నాగరాజు, జాజిమొగ్గల చిరంజీవి పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్ సన్నిబాబు

అఘాయిత్యాలను ధైర్యంగా ఎదుర్కోవాలి

ప్రజాశక్తి-నక్కపల్లి: అఘాయిత్యాలు, దాడులను మహిళలు, బాలికలు ధైర్యంగా ఎదుర్కోవాలని ఎస్ఐ సన్ని బాబు సూచించారు. నక్కపల్లిలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో గురువారం విద్యార్థినిలకు నేరాలు- రక్షణ, సైబర్ క్రైమ్, దిశా చట్టం, ట్రాఫిక్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా అఘాయిత్యాలు, దాడులకు పాల్పడితే ఎదుర్కొనే విధానంపై అవగాహన కల్పించారు. ఆడ బిడ్డలకు పోలీస్ వ్యవస్థ రక్షణగా ఉంటుందన్నారు.

అవగాహన కల్పిస్తున్న పశు వైద్యాధికారి

కోళ్ల పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి- చీడికాడ:మండలంలో బి.సింగవరం గ్రామంలో గురువారం పశు వైద్య అధికారి గణేష్ పౌల్ట్రీ ఫామ్‌లను పరిశీలించారు. అనంతరం పౌల్ట్రీ యజమానులతో మాట్లాడుతూ, పౌల్ట్రీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కోళ్ళకి ఎటువంటి వైరల్ జబ్బులు రాకుండా బయో సెక్యూరిటీని పాటించాలని, టీకాలు వేయించు కోవాలన్నారు. పౌల్ట్రీలో బ్లీచింగ్ చల్లి పరిశుభ్రంగా ఉంచి మంచి నీరునందించాలన్నారు. ఎటువంటి అంటువ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయనతోపాటు జైతవరం పశుసంవర్ధక శాఖ సహాయకులు మోర్తా శ్రీనివాసరావు ,పౌల్ట్రీ యజమాని శరగడం ధర్మరాజు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న బాధితుడు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- మాడుగుల:రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్ర గాయాల పాలైన ఘటన చోటు చేసుకుంది. బాధితుడు మాడుగుల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. దీనికి సంబంధించిన వివరాల్లోకి వెళితే మాడుగుల మండలం ఎం.కోడూరు గ్రామానికి చెందిన పెద్దింటి రాంబాబు అదే గ్రామంలో లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో అర్చకునిగా పనిచేస్తున్నాడు. ఆయన బైక్‌పై వెళుతుండగా మాడుగుల హైస్కూల్ కాలనీ వెళ్లే సరికి ఎదురుగా వస్తున్న మరో మోటార్ బైక్ ఢీ కొంది. దీంతో రాంబాబు తీవ్ర గాయాల పాలవ్వగా స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి రిఫర్ చేశారు.

స.హ చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-మాడుగుల:మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి ఎం. వాసుదేవరావు ఆ శాఖ సిబ్బందికి సమాచార హక్కు చట్టం పై అవగాహన కల్పించారు. ఈ చట్టం ద్వారా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు సంబందించిన సమాచారాన్ని ప్రతీ పౌరుడు పొందవచ్చునన్నారు. ఎస్సీ, ఎస్టీ లు, తెల్ల రేషన్ కార్డుదారులు ఎటువంటి రుసుం లేకుండా సమాచారం పొందవచ్చునన్నారు. సమాచారం కోసం దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు జత చేయవలెనని, నిబందనలకు లోబడి 30 రోజు లలో కోరిన సమాచారాన్ని దరఖాస్తు దారునికి ఇవ్వవలసి ఉంటుందని స్పష్టం చేశారు. కోర్టు పరిధిలోని అంశాలు, వ్యాపార రహస్యాలు, నేరాన్ని ప్రేరేపించే సమాచారం ఇవ్వడానికి వీలు కాదని సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి వాసుదేవరావు

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి- అరకులోయ రూరల్:అరకులోయ మండలం చొంపి పంచాయితీ పరిధి గ్రామాలైన కొత్తవలస, మర్రివలస గ్రామాల్లో మంచినీటి సమస్యను పరిష్కరించాలని సెక్రటరీకి గురువారం రెండోవ వార్డు సభ్యులు బి.కోగేశ్వరరావు, పేసా కమిటీ కార్యదర్శి పి.దశరథ్, సిపిఎం నేత జి.జగన్నాథం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత సంవత్సరం చొంపి గ్రామంలో ట్యాంకు నిర్మాణం చేసి కనెక్షన్ ఇవ్వలేదని చెప్పారు. కొత్తవలస గ్రామంలో బోర్వెల్ వేసి ట్యాంక్ నిర్మించలేదన్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గుత్తేదారులు మధ్యలో పనులు ఆపేయడంతో మంచినీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వేసవి కాలంలో వస్తుండడంలో మంచినీటి సమస్య మరింత తీవ్రమయ్యే పరిస్థితి వుందని అన్నారు. సమస్య తీవ్ర కాకుండానే ముందస్తు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.పంచాయితీ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ లేక అస్తవ్యస్తంగా తయారైందని అన్నారు. మురుగునీరు నిల్వ ఉండి దోమలు విపరీతంగా పెరగడంతో ప్రజలు అనేక జబ్బుల బారిన పడి ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ మీటర్ రీడింగ్ 0
బిల్లు రూ.461
- అదనపు ఛార్జీల పేరుతో వడ్డన
- ఆందోళనలో వినియోగదారుడు

ప్రజాశక్తి -కోటవురట్ల: వచ్చిన విద్యుత్ మీటర్ రీడింగు సున్నా అయినా బిల్లు దాదాపు రూ.461 వచ్చింది. దీంతో, వినియోగదారుడు ఆందోళన చెందుతున్నాడు. మండలంలో పాములు వాక గ్రామంలో ఎస్ఎస్ఏ విద్యాసంస్థల అధినేత సాయి మాట్లాడుతూ, 0786 నెంబర్ తన విద్యుత్ మీటర్ గత నెల, ఈనెల వినియోగించక పోవడంతో రీడింగ్ 0 చూపిస్తున్నా బిల్లు మాత్రం రూ.461 వచ్చింది. ప్రతి నెలా ఇదే పరిస్థితి నెలకొంటుందని అనేకమార్లు విద్యుత్ శాఖ అధికారులకు చెప్పినా యధావిధిగా బిల్లులు అప్లోడ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. తన విద్యుత్ బిల్లులో ఎఫ్పిపిసిఎ చార్జ్ రూ.293, ఎఫ్పిపిసిఎ3 చార్జ్ రూ.109 పేరుతో వేశారన్నారు. సంబంధిత శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి సర్చార్జీల పేరిట దోపిడి ఆపాలని తెలిపారు.

ELECTRICITY BILL SWV:3.2 1R
Reading Mode : E
DT:05-02-2025 Time :02:19 pm GRP:M1
BNo 950226749343 GRP:M1
ERO NARSIPATNAM
SEC KOTAURATLA
DIST ANAKAPALLI
UNG SC 26749343
SCNO 11575ZC3150007B6
NAME T.ANGITHI PA...
ADDR 3-119*AMULANAKAPAMU...
CAT :1 PH :1
SCAT : LT Domestic - Domestic
CONTRACTED LOAD 1.0KW
CONNECTED LOAD 1.0KW
MNO 5127055 MF:1.0
READING MONTH STS
PRES KWH 8379 05-02-2025 9
PREV KWH 8379 05-01-2025 1
AVG UNITS 5
BILLED UNITS 0
RMD 0.22KVA
ENERGY CHRG 0.00
FIXED CHRG 10.00
CUST CHRG 25.00
ED 0.00
SURCHARGES 25.00
ED INT 0.00
TRUEUP CHRG 0.00
FPPCA CHRG 293.21
FPPCA2 CHRG 0.00
FPPCA3 CHRG 109.03
SHORTFALL 0.00
ACD SURCHRG 0.00
FAN INSTAL 0.00
ADJ AMOUNT 0.00
LOSS/GAIN -0.24
BILL AMOUNT 462.00
GOVT SUBSIDY 0.00
BILL AFT SUB 462.00
TSD-TDS : 0.00
ARREARS 0.00
AFT 01/04/24 0.00
AFT 01/04/24 -0.08
NET BILL 461.92
DUE DATE 19-02-2025

అధికంగా వచ్చిన బిల్లు

7, 8 తేదీల్లో యువజనోత్సవాలు
ప్రజాశక్తి -నక్కపల్లి: పాయకరావుపేట శ్రీ ప్రకాష్ అనుబంద విద్య సంస్థ సైన్సెస్ డిగ్రీ కళాశాలలో ఈనెల 7, 8 తేదీల్లో రెండు రోజులు పాటు స్పందన యువ జనోత్సవాలు నిర్వహించనున్నట్లు శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ తెలిపారు. ఈ యువజన ఉత్సవాల్లో విద్యార్థినీ, విద్యార్థులు సాహిత్యం, లలిత కళలు, సంగీతం, నృత్యం, నాటకాలు, క్రీడలు వంటి వివిధ అంశాలపై తమ ప్రతిభ పాటవాలను ప్రదర్శిస్తా రన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్ర యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈ.ఎన్ ధనుంజయరావు, శ్రీ ప్రకాష్ పూర్వ విద్యార్థి ఫోరెన్సిక్ సైంటిస్ట్ పి.వి.ఎస్.బి .చలపతి, శ్రీ ప్రకాష్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ కె. నరేంద్రబాబు పాల్గొంటారని విజయ్ ప్రకాష్ తెలిపారు.

అవగాహన కల్పిస్తున్న వైద్యులు

గుండె వ్యాధులపై అవగాహన
ప్రజాశక్తి-కోటవురట్ల: గుండె వ్యాధులు నివారణ చర్యల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై స్థానిక సిహెచ్సిలో డాక్టర్ గోదాదేవి సిబ్బందికి అవగాహన కల్పించారు. గుండెపోటు లక్షణాలు కనిపిస్తే తీసుకోవలసిన జాగ్రత్తలు పట్ల పిహెచ్సి సిబ్బందికి తెలియజేశారు. లక్షణాలు కలిగిన వ్యక్తికి ప్రథమ చికిత్స అదేవిధంగా మొదటి గంటలో ఆసుపత్రికి తరలిస్తే మంచి ఫలితాలు ఉంటాయని తెలిపారు. ప్రతినిత్యం శారీరక శ్రమతో కూడిన వ్యాయామం చేయడంతో పాటు బీపీ, షుగర్ వ్యాధులను అదుపులో ఉంచుకోవాలన్నారు.

బాధిత కుటుంబానికి సరుకుల అందజేత
ప్రజాశక్తి-అరకులోయరూరల్: అల్లూరి జిల్లా అనంతగిరి మండలం బొర్ర పంచాయతీ గేటువలస గ్రామానికి చెందిన బ్రో సంస్థ కార్యదర్శి చిన్న అనారోగ్యంతో మృతి చెందడం భాధాకరమని మాతృభూమి సేవ సంఘం కార్యదర్శి గోపాల్ రావు తెలిపారు. మాతృభూమి సేవ సంఘం టీం సభ్యులు దేవ్ సురేంద్ర,జయమ్మ మోహన్ రావులు సరుకులు ఆ కుటుంబానికి అందించారు.

నిరుపయోగంగా వసతి గృహాలు

ప్రజాశక్తి-కోటవురట్ల: మండల కేంద్రంలో సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలు నాలుగు భవనాలు ఉండగా ప్రస్తుతం రెండు మాత్రమే ఉపయోగంలో ఉన్నాయి. ప్రస్తుతం ఒకటి తహసిల్దార్ కార్యాలయం వద్ద వినియోగంలో ఉన్న బాలికల వసతి గృహం, మరొకటి ఇంటిగ్రేటెడ్ హాస్టల్ వసతి గృహం వినియోగంలో ఉన్నాయి. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎస్సీ బాలుర హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో నిరుపయోగంగా ఉంది. అదేవిధంగా సుమారు గడిచిన 10 సంవత్సరాల క్రితం కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బీసీ కాలనీ వద్ద నిర్మించిన దాదాపు రెండు కోట్ల విలువ గల మరో హాస్టల్ భవనం నాలుగు సంవత్సరాలు మాత్రమే వినియోగించి నిరుపయోగంగా వదిలేసారు.

తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో బాలికల వసతిగృహం దాదాపు 40 సంవత్సరాల క్రితం నిర్మించారు. శిథిల భవనం కావడంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారని ప్రజాశక్తి పత్రికతో పాటు పలుమార్లు పలు పత్రికల్లో కథనాలు రావడంతో ఇటీవల 15 లక్షల నిధులు ఇటీవల కూటమి ప్రభుత్వం విడుదల చేసి పనులు ప్రారంభించారు. సదరు హాస్టల్ భవనం స్లాబ్ పెచ్చులు ఊడటంతో పాటు వర్షానికి కారిపోతున్న తరుణంలో మరమ్మతులు చేపడుతున్నారు. ఈ హాస్టల్ భవనం ఆవరణ నుండి పంచాయితీ మురికి కాలువ నిర్మాణం చేపట్టడంతో

బిసి కాలనీలో నిరుపయోగంగా ఉన్న వసతి గృహం

తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది. దీంతో దోమలు బెడద కూడా అధికంగా ఉండడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. బీసీ కాలనీ వద్ద నిర్మించిన హాస్టల్ భవనం వృధాగా పడి ఉందని, ఆ భవనాన్ని వినియోగంలోకి తీసుకువస్తే బాగుంటుందని స్థానికులు తెలిపారు. సంబంధిత శాఖ అధికారులు ఇప్పటికైనా భవనాన్ని గుర్తించి అందుబాటులోకి తీసుకురావాలని మండల వాసులు కోరుకుంటున్నారు.

అమెరికా పర్యటనను మోడీ రద్దు చేసుకోవాలి
-కెఎ పాల్ డిమాండ్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: అమెరికాలోని భారతీ యులను అక్రమ వలసదారులంటూ ముద్ర వేసి, వారికి బేడీలు వేసి మన దేశానికి పంపిస్తుంటే, దేశ ప్రధాని మోడీ, విదేశాంగ మంత్రి జయశంకర్ లు ఏమి చేస్తున్నారని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కె.ఎ పాల్ ప్రశ్నించారు.గురువారం ఆసీలుమెట్టలో ఉన్న తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్ మాట్లాడుతూ, అమెరికాలోని భారతీయులను ఆ విధంగా పంపించడానికి వారేమైనా ఉగ్రవాదులా అని ప్రశ్నించారు. భారత్ కు ద్రోహం చేస్తున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ను కలిసేందుకు ప్రధాని మోడీ వెళ్ళటం సరికాదని, ఈ పర్యటనను రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు.విదేశాంగ మంత్రి జై శంకర్ తక్షణం రాజీనామా చేయాలన్నారు. ట్రంపు చర్యల పై ఎపి ఎంపీలు, ఎమ్మెల్యేలు తమ గళం విప్పాలన్నారు. విశాఖ ఎంపీ తన మామయ్య పాటలు వింటూ, కాలక్షేపం చేస్తున్నారని ఎద్దేవా చేశారు.ఒకప్పుడు మోడీని తిట్టిన చంద్రబాబు నాయుడు ఇప్పుడు తెగ పొగుడుతున్నారని ఆరోపించారు. దోచుకోవటమే లోకేష్ కు వాళ్ళ నాన్న నేర్పించాడని,వాళ్ల దగ్గర పవన్ నేర్చుకుని కోట్లు దోచుకుంటున్నారని ఆరోపించారు.

మాట్లాడుతున్న కెఎ పాల్

హామీల అమలు ఏదీ?
మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: బాబు షూరిటీ, మోసాలకు గ్యారెంటీ అని వైసిపి దక్షిణ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆరోపించారు.9 నెలల కూటమి పాలనలో ప్రజలు విస్తుపోతున్నారన్నారు. 37వ వార్డుకు చెందిన పలువురు గురువారం ఆసీలుమెట్టలోని కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ సమక్షంలో వైసిపిలో చేరారు.ఈ వార్డుకు చెందిన మహిళ నాయకురాలు తుపాకుల శకుంతలా దేవితో పాటు మరి కొంతమంది మహిళలకు వాసుపల్లి ఆ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం వాసుపల్లి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో ప్రజలు విస్తుపోతున్నారని, అందుకే వైసిపి వైపు మహిళలు మొగ్గుచూపుతున్నారన్నారు.జమిలి ఎన్నికలొస్తే మళ్లీ వైసిపిదే అధికారం అని స్పష్టం చేశారు. అందలం ఎక్కడం కోసం చంద్రబాబు అబద్దాల హామీలతో

పార్టీలోకి ఆహ్వానిస్తున్న వాసుపల్లి

అధికారంలోకి వచ్చారని, జగన్ హయంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు తూట్లు పొడిచారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో వైసీపీ బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు ననపల రవీంద్ర భరత్, పార్టీ దక్షిణ మహిళా అధ్యక్షురాలు వాసుపల్లి బంగారమ్మ, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ ఆకుల శ్యాం, వాళ్లశెట్టి లక్ష్మి, పోలవరపు దుర్గాప్రసాద్, పావని, కొండా మాలతీ, దుర్గ, గంగళ రాంరాజు, చేపల రాజు తదితరులు పాల్గొన్నారు.ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన తాడి వీధికి చెందిన వైసిపి యువ కార్యకర్త పెంట రవిని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. వైద్యు నిమిత్తం రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో వార్డు వైసిపి అధ్యక్షుడు చిన్ని పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యాలు
ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కృష్ణదేవిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం పేర్వేల్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్స్పాల్ రుత్తల గంగరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. పేర్వేల్ డే వేడుకలను పాఠశాల ఆవరణ పండుగ వాతావరణం తలపించింది.

డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

చెట్టుపల్లిలో శివాలయం ప్రారంభం
ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: మండలంలో చెట్టుపల్లి గ్రామంలో నూతనముగా నిర్మించిన ఐశ్వర్యంబికా సహిత అనంతేశ్వర స్వామి శివాలయాన్ని ప్రారంభించారు. శివలింగాన్ని ప్రతిష్ఠించి రుద్రాభిషేకములు, హోమం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే గణేష్ దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. శివరాత్రి, కార్తీక మాస దినాల్లో అభిషేకాలు నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

నేటి నుంచి హోమ్ లోన్ ఎక్స్పో
ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్, సర్కిల్ ఆఫీస్ (విశాఖపట్నం) ఆధ్వర్యంలో రామా టాకీస్ వద్ద అంబేద్కర్ భవన్లో ఈనెల 7, 8వ తేదీలలో హోమ్ లోన్ ఎక్స్పో - 2025 నిర్వహిస్తున్నట్లు బ్యాంక్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎక్స్పోలో ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థల బిల్డర్లు, ఇంటీరియల్ డిజైనర్స్, సోలార్ రూఫ్ టాప్ సంస్థలు పాల్గొంటాయన్నారు. హోమ్లో లోన్ కావలసిన వారికి బ్యాంకు తరపున తక్షణ ఋణ సదుపాయం, జీరో ప్రొసెసింగ్ ఫీజు, తక్కువ ఇఎమ్ఐ, డోర్ స్టెప్ కస్టమర్ సర్వీస్, టాప్ అప్ లోన్స్ అందించబడతాయన్నారు.

మత్స్యకార సంఘం అధ్యక్ష పదవికి శివ రాజీనామా
ప్రజాశక్తి -నక్కపల్లి: జాతీయ మత్స్యకార సంఘం నక్కపల్లి మండల అధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్లు వాసుపల్లి శివ గురువారం ప్రకటించారు. రాజీనామా పత్రాన్ని జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోసా అప్పలరాజుకు వాట్సాప్ ద్వారా మెసేజ్ పంపినట్లు తెలిపారు.